
నిరసన కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల

మోదీ, ట్రంప్ దిష్టిబొమ్మల దహనం

అమెరికా పట్ల మోదీ సర్కారు నిర్లిప్త వైఖరిపై కాంగ్రెస్ నిరసన

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో భారతీయ పౌరుల ఆత్మగౌరవాన్ని కాపాడటంలో బీజేపీ ప్రభుత్వం విఫలం చెందిందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఆరోపించారు. టీపీసీసీ పిలుపు మేరకు శనివారం జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అమెరికాలోని భారతీయులపై ట్రంప్ ప్రభుత్వం చర్యలను ఆక్షేపించారు. జిల్లా కాంగ్రెస్ కార్యాలయం ఎదుట మోదీ, ట్రంప్ దిష్టి బొమ్మలను దహనం చేశారు. ఇప్పటికే 104 మంది భారతీయ పౌరులకు అమెరికా ప్రభుత్వం సంకెళ్లు వేసి తిరిగి వెనక్కిపంపినా మోదీ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అమెరికా వైఖరిపై కేంద్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్‌చౌదరి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బొడ్డు బొందయ్య, కార్పొరేటర్లు రాపర్తి శరత్‌కుమార్, గజ్జల లక్ష్మి, పాకాలపాటి విజయనిర్మల తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చినజీయర్ స్వామి


కొనసాగుతున్న శోభాయాత్ర

మనందరిది భగవత్ కుటుంబం

- సమాజం కోసం అందరం కలిసి పని చేయాలి
- వేదసారమైన వెయ్యి నామాలతో రూపుదిద్దుకున్నదే విష్ణు సహస్రనామం: చినజీయర్‌స్వామి
- భద్రాద్రిలో శోభాయమానంగా సాగిన శోభాయాత్ర 6

భద్రాచలం పుణ్యక్షేత్రం శనివారం ఆధ్యాత్మిక సౌరభంతో గుబాళించింది. భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో విరాట్ విష్ణుసహస్రనామస్తోత్ర పారాయణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా త్రిదండి చినజీయర్‌స్వామి అనుగ్రహభాషణం చేశారు. అంతకుముందు పట్టణంలో శోభాయాత్ర కనులపండువగా సాగింది. - ఆంధ్రజ్యోతి, భద్రాచలం


సుభాష్‌నగర్ పాఠశాలలో నిర్మించిన వాష్‌రూమ్‌లు

'మన ఊరు- మన బడి' పథకంలో నామినేషన్ పద్ధతిలో చిన్న చిన్న పనులు చేసిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం గగ్గోలు పెడుతున్నారు. మూడేళ్ల క్రితం భద్రాద్రి జిల్లా వ్యాప్తంగా 362 పాఠశాలల్లో విద్యార్థులకు వసతులు కల్పించేందుకు పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించలేదు. పదిరోజుల్లో బిల్లులు చెల్లించకుంటే పనులు చేసిన ప్రభుత్వ బడులకు తాళాలు వేసి ఆందోళనకు దిగుతామని ఆయా కాంట్రాక్టర్లు అల్టిమేటం జారీ చేశారు. విద్యా కమిటీలు, ప్రధానోపాధ్యాయులు, ప్రజాప్రతినిధుల ఉమ్మడి తీర్మానాలతో నామినేషన్ పద్ధతిన పనులు చేశారు. పాఠశాలల్లో టాయిలెట్స్, బాత్‌రూమ్‌లు, కిటికీలు, హ్యాండ్ వాష్‌లు, వాష్ రూమ్‌లు, విద్యుత్ సౌకర్యాలు, ప్లాస్టరింగ్ పనులు, సెల్ఫ్‌లు, వరండాల ఫ్లోరింగ్‌లు, గేట్లు, ఆర్చీలు తదితర పనులు చేశారు.

బడులకు తాళాలు వేస్తాం..

'మన ఊరు - మనబడి' పథకం కాంట్రాక్టర్ల అల్టిమేటం

- మూడేళ్లు దాటుతున్నా.. అందని బిల్లులు
- అప్పులు, వడ్డీల భారంతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన
- జిల్లాలో 362 పాఠశాలల్లో అభివృద్ధి పనులు

ఇల్లెందు, ఫిబ్రవరి 8, (ఆంధ్రజ్యోతి): ఆర్‌అండ్‌బీ, ఇంజనీరింగ్, విద్యాశాఖ అధికారుల ఒత్తిడి మేరకు కాంట్రాక్టర్లు అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి పనులను జరిపించారు. 362 పాఠశాలల్లో దాదాపు రూ.96 కోట్ల విలువైన పనులు జరిగాయి. ఇల్లెందు మండలంలోనే 30 పాఠశాలల్లో రూ.7.21 కోట్లు విలువైన పనులు ఈ పథకం ద్వారా పనులు చేశారు. పనులు జరుగుతున్న సమయంలో కొంత మేర బిల్లులు చెల్లించనప్పటికీ ఇంకా 70 నుంచి 80 శాతం పనులకు బిల్లులు చెల్లించలేదని కాంట్రాక్టర్లు తెలిపారు. మన ఊరు - మన బడి పథకానికి చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరించడంతో పలుశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి పెంచి పనులు జరిపించారు. ఒక్కో పాఠశాలలో సగటున రూ.8 లక్షల నుంచి రూ.20 లక్షల విలువైన పనులు జరిగాయి. కాగా జిల్లాలో పాఠశాలల పెయింటింగ్ పనులు ఒకే కాంట్రాక్టర్‌కు అప్పగించడం గమనార్హం.

ముగ్గురు కలెక్టర్లు మారారు..

పాఠశాలల్లో వసతి సౌకర్యాలు కల్పించే పథకాన్ని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసింది. పనులు గత ప్రభుత్వ పాలనలో జరిగిన పిదప రెండేళ్లుగా బిల్లుల కోసం కాంట్రాక్టర్లు అధికారులు చుట్టూరా తిరిగినా అప్పటి ప్రభుత్వం బిల్లులు చెల్లించలేదు. గత ఏడాది నూతనంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటికి కూడా అధికారులను బిల్లుల కోసం ప్రాధేయపడుతున్నప్పటికీ చెల్లించలేదని వాపోతున్నారు. పనులు జరిగాక జిల్లాలో ముగ్గురు కలెక్టర్లు మారిపోయారని రాష్ట్రంలో ప్రభుత్వం మారిందని కానీ తమ గోడు పట్టించుకునే నాధుడే కరువయ్యారని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

ఆందోళనకు కార్యాచరణ

మన ఊరు - మన బడి పథకంలో పాఠశాలల్లో నామినేషన్ పద్ధతిలో చేసిన మౌళిక వసతుల పనుల బిల్లులు మూడేళ్లుగా చెల్లించక పోవడంతో నిరుద్యోగ కాంట్రాక్టర్లు ఆందోలనల బాట పడుతున్నారు. ఇల్లెందు మండలంలోని వివిధ పాఠశాలల్లో పనులు చేసిన నిరుద్యోగ కాంట్రాక్టర్లు కొల్లి సంజీవరెడ్డి, ఊరుకొండ ధనుంజయ్, వల్లాల రంజీత్, పర్రె శ్రీనివాస్, అంకెపాక నవీన్ తదితరులు మాట్లాడుతూ సేవా భావంతో విద్యా కమిటీల అభ్యర్థనల మేరకు రూ.లక్షలు వడ్డీలకు తెచ్చి పనులు చేశామని తెలిపారు. తమ బిల్లులు పది రోజుల్లో చెల్లించకపోతే తాము పనులు చేసిన ప్రభుత్వ పాఠశాలలకు తాళాలు వేసి గేట్ల ఎదుట ఆందోళనలకు పూనుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా లలితా జ్యువెలరీ ప్రారంభం

- లాంఛనంగా ప్రారంభించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి
- తయారీ ధరకే బంగారం, వజ్రాభరణాలు: చైర్మన్ కిరణ్‌కుమార్


ఖమ్మంలో లలితా జ్యువెలరీని ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం ఖానాపురం హవేలి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ లలితా జ్యువెలరీ 60వ షోరూమ్‌ను శనివారం నగరంలోని వైరా రోడ్డులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, లలితా జ్యువెలరీ చైర్మన్ కిరణ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ తక్కువ ధరలకు వినియోగదారులకు నమ్మకమైన నాణ్యమైన బంగారు ఆభరణాలు అందించాలనే లక్ష్యంతో ఖమ్మంలో ప్రారంభించిన లలితా జ్యువెలరీ అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. వినియోగదారులకు ఆకర్షణీయమైన, అందమైన బంగారు నగలు తక్కువ ధరలకే అందించాలన్నారు.

మంత్రి పొంగులేటి మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే అత్యధిక వినియోగదారులను సంపాదించుకున్న లలితా జ్యువెలరీ ఖమ్మంలో షోరూంను ప్రారంభించటం అభినందనీయం అన్నారు. వినియోగదారుల నమ్మకాన్ని వమ్ము చేయకుండా నాణ్యమైన, నమ్మకమైన, బంగారు ఆభరణాలు అందించాలన్నారు. మంత్రుల వెంట నగర మేయర్ నీరజ, బాలసాని లక్ష్మీనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, డిప్యూటీ మేయర్ ఫాతిమాజోహర, 42వ డివిజన్ కార్పొరేటర్ పాకలపాటి విజయనిర్మల, సంస్థ చైర్మన్ కిరణ్‌కుమార్ ఆయన సతీమణి హేమ పాల్గొన్నారు.

లలితా జ్యువెలరీ చైర్మన్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ తక్కువ తరుగు, తక్కువ ధరలకు నగలు అందించాలనే లక్ష్యంతో ఖమ్మంలో షోరూంను ప్రారంభించామన్నారు. ఖమ్మం చుట్టుపక్కల ప్రాంతాల వినియోదారులు ఎక్కువగా తమ ఇతర లలితా జ్యువెలరీ షోరూంలకు **(మిగతా 6వ పేజీలో)**

రాజ్యాంగం సాక్షిగా ఒక్కటైన జంట

టేకులపల్లిలో వినూత్న రీతిలో వివాహం

పెనుబల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కులమతాలు, సంప్రదాయాలకు అతీతంగా నూతన వధూవరులు రాజ్యాంగంపై ప్రమాణం చేసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి దండలు మార్చుకొని నిరాడంబరంగా వివాహం చేసుకున్న సంఘటన ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం టేకులపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. టేకులపల్లి గ్రామానికి చెందిన బీరవల్లి ప్రశాంత్ ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా ఏ కొండూరు గ్రామానికి చెందిన నాగజ్యోతి పెద్దలు నిశ్చయించిన వివాహాన్ని సైతం తమకు ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశం వచ్చేందుకు అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగమే కారణమని భావించిన ఇరువురు అంబేద్కర్ చిత్రపటానికి


ఆదర్శ వివాహం చేసుకున్న జంట

పూలమాలలు వేసి రాజ్యాంగం సాక్షిగా పెళ్లి చేసుకున్నారు. వివాహకర్తలు పత్తిపాటి వెంకటేశ్వరరావు, డాక్టర్ కొచ్చర్ల శ్రీనివాసరావు, మేకాల రామచంద్రరావు, మేకతొట్టి కాంతయ్య సమక్షంలో వివాహం జరిగింది. ప్రశాంత్ బీటెక్ చదివి ఝార్ఖండ్ రాష్ట్రంలో సీసీఎఫ్‌గా విధులు నిర్వహిస్తుండగా నాగజ్యోతి ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తుంది. ఉన్నత చదువులు చదివి ఆదర్శ వివాహం చేసుకున్న దంపతులను బంధుమిత్రులు, గ్రామస్థులు అభినందించారు.

'ఉపాధి' పథకాలకు 'మునిసిపాలిటీ' గండి

- అశ్వారావుపేట శివారు పల్లెలకు కొత్త కష్టాలు
- మునిసిపాలిటీ పరిధిలోకి రావడంతో గ్రామీణ పథకాలు కట్
- మూడు పంచాయతీల్లో నిలిచిన 'ఉపాధి హామీ' పనులు
- ఆత్మీయ భరోసాపైనా నీలినీడలు..


6

ప్రకృతి హరిత దీక్ష... భావితరాలకు రక్ష

- పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న రాజశేఖర్
- ప్రధాని మోదీ నుంచి ప్రశంసలు
- గణతంత్ర వేడుకలకు ఢిల్లీ వెళ్లొచ్చిన ప్రకృతి ప్రేమికుడు

ఉమ్మడి జిల్లాలోని నియోజకవర్గ కేంద్రమైన వైరాకు చెందిన కేపీ.రాజశేఖర్ 'ప్రకృతి హరిత దీక్ష... భావితరాలకు రక్ష..' అనే నినాదంతో అనేక ఏళ్ల నుంచి పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. ప్రకృతి, పర్యావరణానికి రాజశేఖర్ చేస్తున్న కృషిని గుర్తించిన కేంద్రం.. ప్రధాని మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమంలో మాట్లాడే అవకాశాన్ని దక్కించుకొని ప్రశంసలు అందుకున్నారు. ఈ ఏడాది జనవరి 26న ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.



వైరా, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వైరాకు చెందిన రాజశేఖర్ ప్రస్తుతం భద్రాద్రి జిల్లాలో సింగరేణి కాలరీస్ వర్క్‌షాపులో ఫిట్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఓ వైపున ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మరోవైపు పర్యావరణం కోసం దీక్ష బూనారు.

11 ఏటనే ప్రకృతి ప్రేమికుడిగా...

రాజశేఖర్ 11 ఏళ్ల వయస్సులోనే అంటే 1980లో తండ్రి పాండు స్ఫూర్తితో ప్రకృతి ప్రేమికుడిగా మారి ఆ కార్యక్రమంలో సేవకుడయ్యాడు. సింగరేణిలో ఉద్యోగం చేస్తూ డ్యూటీ ముగిసిన తర్వాత ప్రతిరోజూ కనీసం రెండు గంటల సమయం కేటాయిస్తూ గత తొమ్మిదేళ్ల నుంచి క్రమం తప్పకుండా ద్విచక్ర వాహనంపై పచ్చని మొక్క, గ్లోబ్‌ను అనుకూలంగా అమర్చి మొక్కలు, గింజలు, కాటన్ సంబంధిత బ్యాగ్స్ పిచ్చుక గూళ్లతో అందరూ వాతావరణ సమతుల్యత కోసం మొక్కలు నాటి వాటిని మహావృక్షాలుగా చేయాలని, ఉన్న చెట్లను కాపాడుకోవాలని, వన్యప్రాణులను రక్షించుకోవాలని, కాటన్ బ్యాగ్ వాడాలని ప్రచారం చేస్తున్నారు. 2019లో పుట్టిన ప్రతి బిడ్డకు డాక్టర్లతో మొక్క బహుమతి అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మై షాప్ గార్డెన్ కార్యక్రమంలో మొక్కను బతికించు... తెలుగుభాషను రక్షించు అనే నినాదంతో ప్రచారం చేపట్టారు. కోటి గింజల సేకరణ, గింజలు పంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.



ప్లాస్టిక్ బొకేలు వద్దు... మొక్కలే ముద్దు..

ప్లాస్టిక్ బొకేలు వద్దు... పచ్చని మొక్కలే ముద్దు అనే నినాదంతో సన్మాన, అవార్డు గ్రహీతలకు, ప్రముఖులకు, వేదికలపై అతిథులకు కలెక్టర్లు, రాజకీయ నాయకులు, సింగరేణి అధికారులు, బంధుమిత్రులకు బొకేలు కాకుండా పచ్చని మొక్కలు ఇచ్చి శుభాకాంక్షలు, స్వాగతం తెలిపే సంప్రదాయాన్ని ప్రారంభించారు. ప్రతీరోజూ క్రమం తప్పకుండా కనీసం ఏదైనా ఒక మొక్కను నాటే కార్యక్రమాన్ని 2020లో ప్రారంభించి ఇప్పటివరకు ఐదేళ్లుగా అంటే 1667 రోజుల నుంచి ఈ కార్యక్రమాన్ని నిర్విరామంగా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమం ద్వారా దేశ ప్రధాని నరేంద్రమోదీ నుంచి ప్రశంసలు అందుకున్నారు. ప్రకృతి హరిత దీక్షా... భావితరాలకు రక్షా అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి పిల్లల నుంచి పెద్దల వరకు ప్రముఖులతో మొక్కలు నాటిస్తున్నారు. గణేష్, దసరా నవరాత్రుల సందర్భంగా మట్టితో తయారుచేసిన దేవతా విగ్రహాలను వినియోగించేలా అవగాహన కల్పిస్తున్నారు. మీ గూడుతోపాటు పిచ్చుక గూడును పెట్టండి అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి పిచ్చుక గూళ్లను, ధాన్యపు గింజలను, మట్టినీటి చిప్పలు ప్రచారంలో అందిస్తూ జీవవైవిధ్యం కోసం వన్యప్రాణులను కాపాడుకోవాలని ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రకృతి దీక్షా పరుడికి అనేక అవార్డులను పలు స్వచ్ఛంద సంస్థలు అందజేశాయి. రాజశేఖర్.. రిపబ్లిక్ వేడుకలకు కుటుంబ సమేతంగా ఢిల్లీ వెళ్లి పాల్గొన్నారు. అక్కడ కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ సహా పలువురు ప్రముఖులను కలిసి తాను చేపట్టిన కార్యక్రమాల గురించి వివరించి అభినందనలు అందుకున్నారు.



ప్రకృతి పంటలను పరిశీలించిన హన్మకొండ రైతులు



అశ్వారావుపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మల్లాయిగూడెం, దిబ్బగూడెం, పండువారిగూడెం గిరిజన గ్రామాల్లో నాబార్డు సహకారంతో చేస్తున్న ప్రకృతి వ్యవసాయాన్ని హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలానికి చెందిన రైతుల బృందం శనివారం సందర్శించారు. వాసన్ సంస్థ ఆధ్వర్యంలో రైతులు సాగు చేస్తున్న వేరుశనగ, ఆకుకూరలు, మునగ, పండ్ల పెంపకం, తదితర అంతర పంటలను పరిశీలించారు. పంటల సాగు, దిగుబడులు, ఆదాయం, ఖర్చు తదితర వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వాసన్ సంస్థ సిబ్బంది సతీష్, కో ఆర్డినేటర్ వెంకటేశ్వరరావు, చక్రపాణి, శ్రీనివాస్, రైతులు దారా ప్రసాద్, మల్లయ్య పాల్గొన్నారు.

లక్ష్యాలు సాధిస్తున్నాం.. పీఆర్పీ చెల్లించండి

సింగరేణి సంస్థకు ఏరియా అధికారుల సంఘం వినతి



జీఎంకు వినతి పత్రాన్ని అందిస్తున్న ఏరియా అధికారులు

మణుగూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో నిర్దేశిత ఉత్పత్తి ఉత్పాదకత పెంపు తోపాటు రవాణా విషయంలో ప్రగతిని సాధి స్తూ సంస్థను లాభాల్లో నడిపించడంలో శక్తి వంచన లేకుండా శ్రమిస్తున్నాం. అధికారుల జీతంలో భాగమైన పెర్ఫార్మెన్స్ రిలేటెడ్ పే (పీఆర్పీ) 2022-23ని నేటి వరకు చెల్లించలేదు.. వెంటనే చెల్లించే విధంగా యాజమాన్యం చర్య లు చేపట్టాలని కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ మణుగూరు ఏరియా సభ్యులు శనివారం ఏరియా జీఎంకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీఎంవోఏఐ నాయకులు లక్ష్మీపతి గౌడ్ మాట్లాడుతూ.. సంస్థ సీఎండీ నాయకత్వంలో 2023-24ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉత్పత్తి, రవాణా, లాభాల విషయంలో అపూర్వమైన ప్రగతిని సాధించడం జరిగిందన్నారు. సీఎండీ మరో ఏడాది కొనసాగింపు పై హర్షం వ్యక్తం చేస్తూ.. ఈ ఏడాది కూడా నిర్దేశిత లక్ష్య సాధనకు సంసిద్ధంగా ఉన్నామని తెలిపారు. అయితే పీఆర్పీని కోల్ ఇండియాలో జూన్ 2024న అక్కడి ఉద్యోగులకు చెల్లించడం జరిగిందని, అయితే సింగరేణిలో మాత్రం జాప్యం జరుగుతోందన్నారు.దీంతో అధికారులు కొంత నిరుత్సాహం, అసంతృప్తితో ఉన్నారన్నది వాస్తవమన్నారు. పీఆర్పీని చెల్లించేందుకు సత్వర ఏర్పాట్లు చేయాలని సీఎండీకి విజ్ఞప్తి చేశారు. అలాగే 2024 నవంబరు 25న అధికారులతో జరిగిన నిర్మాణాత్మక సమావేశంలో యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లిన సమస్యల ప రిష్కారానికి చొరవ చూపాలని కోరారు. సంస్థ పట్ల నిబద్ధతతో, నిజాయితీగా పనిచేసే అధికారులకు భరోసా కల్పిస్తూ లక్ష్య సాధనలో పూర్తి స్థాయిలో పనిచేసే విధంగా నిర్ణయాలు తీసుకోవాలని సంస్థ సీఎండీకి సీఎంవోఏఐ బాధ్యుడిగా లక్ష్మీపతిగౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ విషయాలను తెలియజేస్తూ ఏరియా జీఎం దుర్గం రామచందర్‌కు శనివారం సాయంత్రం వినతిపత్రాన్ని అందించి యాజమాన్యం దృష్టికి విషయాలకు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో ఏరియాలోని పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

జమలాపురం శ్రీవారికి సర్వాంగాభిషేకం

ఎర్రుపాలెం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారికి సర్వాంగాభిషేకం నిర్వహించి ముత్యాల కవచ అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో తెల్లవారుజామున పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో సర్వాంగాభిషేకం నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీవారి ఉత్సవాలను పల్లకీలో ఊరేగించి కల్యాణ వేదిక వద్దకు చేర్చి నిత్యకల్యాణం నిర్వహించారు. భక్తులు పాలు, పొంగళ్లను శ్రీవారికి నివేదించారు. భక్తులు నూతన వాహనాలకు పూజలు చేయించుకుని వాటితో గిరి ప్రదక్షిణ చేశారు. శ్రీవారి ఆలయంతోపాటు భక్తులు ఉపాలయాలను దర్శించుకున్నారు. శ్రీవారిని దర్శించుకున్న భక్తులకు శ్రీవేంకటేశ్వర అన్నదాన సత్రంలో ఏపీలోని కంచికచర్ల గ్రామానికి చెందిన తోటకూర నవీన్‌కుమార్, దుర్గామల్లేశ్వరి సహకారంతో సేవా సమితి నిర్వాహకులు అన్నగోవిందంలో భాగంగా భక్తులకు ఉచితంగా అన్నవితరణ చేశారు.

శ్రీవారి నిత్య అన్నదాన పథకానికి వితరణ

హైదరాబాద్‌కు చెందిన నర్సింగోజు శశాంక్, కావ్య దంపతులు శనివారం శ్రీవారి నిత్య అన్నదాన పథకానికి విరాళంగా రూ.1,00,116ల నగదును ఆలయ ఈవో కొత్తూరు జగన్మోహన్‌రావుకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, సూపరింటెండెంట్ కె.విజయకుమారి, జూనియర్ అసిస్టెంట్ ఇరుకులపాటి కృష్ణప్రసాద్, వేంకటేశ్వర సేవా సమితి నిర్వాహకులు ఎల్వీ నారాయణరెడ్డి, వేద పండితులు, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఆలయ ఈవోకు విరాళం అందిస్తున్న శశాంక్,కావ్య దంపతులు


ఆలయ కార్యనిర్వహణ అధికారులతో మాట్లాడుతున్న సహాయ కమిషనర్ వీరస్వామి

మహాశివరాత్రి ఏర్పాట్లపై ఆలయ అధికారులతో సమీక్ష

దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ వీరస్వామి

ఖమ్మం ఖానాపురంహవేలి ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పండుగ సందర్భంగా వివిధ దేవాలయాల కార్యనిర్వాహణ అధికారులు,అర్చకులతో శనివారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి ఖమ్మం జిల్లా సహాయ కమిషనర్ ఎం.వీరస్వామి నగరంలోని దేవాదాయశాఖ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అధికారులకు వివిధ సూచనలు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చూడాలని, భక్తులకు అవసరమైన చలవపందిళ్లు, క్యూలైన్లు, పారిశుధ్యం, భద్రత, తాగునీరు, వైద్యసదుపాయాలు, రవాణసౌకర్యాలు, టెంపరవరీ టాయిలెట్లు, సీసీకెమేరాలుఏర్పాటుచేయాలన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా దర్శనాలు ఏర్పాటుచేయాన్నారు. ఈసమావేశానికి ఉమ్మడి ఖమ్మం జిల్లలోని వివిధ ఆలయాల ఈవోలు, ఆలయ అర్చకులు, కమిటీ చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా లలితా జ్యువెలరీ ప్రారంభం


జ్యోతి ప్రజ్వలన నిర్వహిస్తున్న మంత్రి పొంగులేటి

(5వ పేజీ తరువాయి)

వచ్చి నగలు కొనుగోలు చేస్తున్నారని అందుకే మా షోరూం ఖమ్మంలో ఏర్పాటు చేశామన్నారు. ప్రారంభోత్సవ ఆఫర్‌గా బంగారు నగలపై తరుగులో ఒక శాతం తగ్గింపు, అదేవిధంగా వజ్రాభరణాలపై క్యారెట్‌కు రూ.5వేల తగ్గింపు లభిస్తుందన్నారు. దీంతో పాటు సరికొత్త ఫ్రీ అండ్ ఫ్లెక్సీ 11 నెలల నగలు కొనుగోలు పథకం ప్రారంభించామన్నారు. పలురకాల నగలు తమ షోరూమ్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు.

ముష్టికుంట్ల పాఠశాలకు మహర్దశ

- పీఎం శ్రీ పథకానికి ఎంపికతో నిధుల వరద



బోనకల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముష్టికుంట్ల ఉన్నత పాఠశాలకు పీఎం శ్రీ పథకం కింద ఈ ఏడాది నుంచి నిధుల మంజూరు కావడంతో పాఠశాలకు మహర్దశ చేకూరనుంది. విద్యార్థులకు అన్ని రకాల వసతుల కల్పనతో పాటు క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా విజ్ఞాన యాత్రలు, ఆదర్శ పాఠశాలల్లో అమలవుతున్న కార్యక్రమాలను పరిశీలించడంతో పాటు విద్యాభివృద్ధి సాధించేందుకు చేపట్టాల్సిన కార్యక్రమాలను అమలు చేయడమే లక్ష్యంగా పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులు శనివారం రావినూతల ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు సందర్శించి అక్కడ అమలయ్యే కార్యక్రమాలను ఉదయం నుంచి సాయంత్రం వరకు పరిశీలించారు. తహసీల్దార్ ఎ.పున్నమ్ చందర్, ఎంఈవో దామాల పుల్లయ్య, హెచ్ఎం భాగ్యలక్ష్మి, గిర్దావర్ గుగులోతు లక్ష్మణ్ విద్యార్థులకు పీఎం శ్రీ పథకానికి సంబంధించి అవగాహన కల్పించారు. విద్యాభివృద్ధిలో భాగంగా నేర్చుకోవాల్సిన అంశాల గురించి వివరించారు.

పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలలకు నాలుగేళ్ల కాల వ్యవధిలో కోటి రూపాయల వరకు నిధులను విడుదల చేస్తారు. ఈ నిధులతో ఇప్పటికే ముష్టికుంట్ల పాఠశాలలోని విద్యార్థులను జిల్లాలోని వెలుగుమట్ల అర్బన్ పార్కుకు తీసుకెళ్లారు. ఆదివారం విద్యార్థులను లక్నవరం చెరువు, రామప్ప దేవాలయం, వెయ్యి స్తంభాల దేవాలయం, ఓరుగల్లు కోటను తీసుకెళ్లేందుకు గానూ ఉపాధ్యాయులు అన్ని ఏర్పాట్లు చేశారు. 9, 10 తరగతుల విద్యార్థులు ఈ యాత్రలో పాల్గొంటున్నారు. దీంతో పాటు పాఠశాలలో ల్యాబ్, కిచెన్ గార్డెన్, డిజిటల్ బోధన పరికరాలను ఏర్పాటు చేసి విద్యార్థులలో సమగ్ర మూర్తిమత్వం పెంపొందించడానికి పీఎంశ్రీ పథకం ఎంతగానో దోహదపడుతుందని ఉపాధ్యాయులు, గ్రామస్థులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

మనందరిది భగవత్ కుటుంబం

- భద్రాద్రిలో చినజీయర్‌స్వామి
- శోభాయమానంగా సాగిన శోభాయాత్ర


శోభాయాత్రలో చిన జీయర్ స్వామి

భద్రాచలం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సమాజం కోసం మనమంతా కలిసి పని చేయాలి... జాతులు, కులాలు, మతాలు వేరైనా మనందరిది భగవత్ కుటుంబమని చినజీయర్‌స్వామి పేర్కొన్నారు. భద్రాచలంలో శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో విరాట్ విష్ణుసహస్రనామస్తోత్ర పారాయణంను భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం చినజీయర్ స్వామి పర్యవేక్షణలో కొనసాగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేద సారమైన వెయ్యి నామాలతో రూపుదిద్దుకున్నదే విష్ణు సహస్రనామమని పేర్కొన్నారు. మహాభారత సారంగా విష్ణుసహస్రనామం కొనియాడబడుతోందన్నారు. భారతంలోని భీష్మ ధర్మరాజుల మధ్య సాగిన సంహవాదం దివ్యస్తోత్రం విష్ణుసహస్రనామని తెలిపారు. ఒక్కసారి పారాయణం చేసినా వేలసార్లు పారాయణం చేసినట్లేనని, భద్రాద్రిలో ఈ పారాయణం చేయడం వలన ఈ ప్రభావం యావత్ ప్రపంచానికి దక్కుతుందన్నారు.

విరాట్ విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణంను పురస్కరించుకొని భద్రాచలంలో నిర్వహించిన శోభయాత్ర శోభాయమానంగా సాగింది. ఓపెన్‌టాప్ వాహనంలో చినజీయర్ స్వామి శోభయాత్రలో ఉండగా రామాలయం నుంచి మంగళవాయిద్యాలు, శ్రీరామరథం, కొమ్ము నృత్యాలు, కోలాటాలు, హరిదాసులు, భజన బృందాలు, బాలల విచిత్ర వేషధారణలతో శోభ యాత్ర భక్తులను ఆకట్టుకుంది. ఈ యాత్ర రాజ వీధి, నెహ్రూ ప్రెస్ రోడ్డు గోపాలకృష్ణ రోడ్డు, ఆఫీసర్స్ క్లబ్, బ్రిడ్జి సెంటర్, అంబేద్కర్ సెంటర్, కూనవరం రోడ్డు, ఐటీడీఏ రోడ్డుల మీదుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానికి చేరుకుంది. ఈ క్రమంలో తొలుత ధ్వజారోహణంను చిన్నజీయర్‌స్వామి నిర్వహించారు. అనంతరం ఈ ప్రాంతంలో గోవులను ప్రత్యక్షంగా, పరోక్షంగా రక్షించే ప్రక్రియలో ఎంతగానో కృషి చేస్తున్న గోసేవకులనుగుర్తించి వారిని చిన్నజీయర్ స్వామి, దేవనాద జీయర్‌స్వామిలు సన్మానించి ప్రశంసాపత్రం అందజేశారు.

విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణంలోభద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొన్నారు. దేవనాద జీయర్ స్వామి, తాళ్లూరి ట్రస్టు చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య, ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ తిప్పన సిద్దులు, భద్రాచలం దేవస్థానం విశ్రాంత ప్రధాన అర్చకులు పొడిచేటి రామచంద్రాచార్యులు, దేవస్థానం అదర్వ వేద పండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు, ఉప ప్రధాన అర్చకులు కోటి శ్రీమన్నారాయణాచార్యులు, ముఖ్య అర్చకులు కోటి విష్ణువర్ధనాచార్యులు, జీయర్‌మఠం వికాస తరంగిణి ప్రతినిధులు గట్టువెంకటాచార్య, ఎన్‌సీహెచ్ చక్రవర్తి, రఘుపుంగువ, కమలా రాజశేఖర్, తాళ్లపూడి రాము, మాధవరెడ్డి, కంభంపాటి సురేష్, తిరుమలరావు, నర్సింహారావు, అల్లం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో చిన్నజీయర్‌స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిత్యకల్యాణ మండప వేదిక వద్ద కొద్దిసేపు భక్తులకు అనుగ్రహ బాషణం చేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, స్థానాచార్యులు కేఈ స్థలశాయి, ప్రధాన అర్చకులు అమరవాది విజయరాఘవన్, వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు భద్రాద్రిలో భక్తులకు తీర్థగోష్ఠి నిర్వహించారు.

సేంద్రియ పంట ఉత్పత్తులనే వాడాలి

- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- నగరంలో మెగా ఆర్గానిక్ మేళా ప్రారంభం


ఆర్గానిక్ మేళాను ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం వ్యవసాయం/ఖమ్మం మార్కెట్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం పట్ల ప్రజలు శ్రద్ధ వహించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆహారపు అలవాట్లు కూడా మారుతున్నాయని దాని వల్ల అనారోగ్యాల బారిన పడుతున్నారని మంత్రి అభిప్రాయపడ్డారు. ఖమ్మం నగరంలోని టిడిపి ఆఫీస్ వద్ద గల సమీకృత కూరగాయల మార్కెట్ ఆవరణలో గ్రామ భారతి, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు రోజుల మెగా ఆర్గానిక్ మేళాను శనివారం మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జంక్, ఫాస్ట్ ఫుడ్లకు బదులు సేంద్రియ పద్ధతిలో ఎటువంటి రసాయనాలు వాడకుండా పండించిన పంటలను ఉపయోగించడం వల్ల ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చునని తెలిపారు. మన పూర్వీకులు మనం తినే ఆహార పదార్థాలను ఇంటి పేరట్లోనో, చేలల్లోనో పండించుకుని తినే వారని అందువల్లనే ఆరోగ్యంగా ఉండేవారని అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లమల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వినియోగదారుల స్పందన మేరకు ప్రతి నెల రెండవ శనివారం, ఆదివారం ఆర్గానిక్ మేళాను గ్రామభారతి, సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంకా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్లు మిక్కిలినేని మంజుల నరేందర్, చావా నారాయణరావు, ఏఎంసీ చైర్మన్ యరగర్ల హన్మంతరావు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' పథకాలకు 'మునిసిపాలిటీ' గండి

అశ్వారావుపేట రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మునిసిపాలిటీగా ఆవిర్భవించడంతో నిబంధనల ప్రకారం అర్బన్ ప్రాంతాల్లో కేంద్రం ప్రవేశపెట్టిన గ్రామీణ ఉపాధిహామీ పథకం అమలు చేయని పరిస్థితి. దీంతో పేదలు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. ఉపాధిహామీ ద్వారా అమలు చేసే వివిధ రకాల పనులు నిలిచిపోతున్నట్లుగా సమాచారం. తాజాగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై సైతం నీలినీడలు కమ్ముకున్నాయి.

నిలిచిపోయిన ఉపాధిహామీ పనులు

అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుర్రాలచెరువు పంచాయతీలతో అశ్వారావుపేట మునిసిపాలిటీగా ఏర్పడింది. అయితే నిబంధనల ప్రకారం కేంద్రం అమలు చేస్తున్న గ్రామీణ ఉపాధిహామీ పనులు మునిసిపాలిటీల్లో చేపట్టరు. దీంతో ఈనెల 1వ తేదీ నుంచి ఉపాధిహామీ పథకం నిలిచిపోయింది. ప్రస్తుతం అశ్వారావుపేట పంచాయతీలో గతేడాది ఏప్రిల్ ఒకటి నుంచి 475 కార్డుల్లో ఉన్న 543 మంది యాక్టివ్ కూలీలతో పాటు మరికొంత మంది కూలీలు 7240 పనిదినాలు పనిచేశారు. పేరాయిగూడెం పంచాయతీలో 318 జాబ్‌కార్డుల్లో ఉన్న 457 మంది యాక్టివ్ కూలీలతో పాటు మరికొంత మంది 9461 రోజులు పనిచేశారు. ఇక్కడ ఏటా వందల మంది పేదలకు ఇదే ఆధారంగా ఉంటుంది. గుర్రాలచెరువు పంచాయతీలో 91 కుటుంబాలకు చెందిన 125మంది కూలీలు 3492 రోజులు చేశారు. ప్రతి పంచాయతీలోనూ కూలీలకు సగటున రోజుకు రూ.200వరకు కూలి పడింది. పైలెక్కల ప్రకారం వందల మంది కూలీలు దాదాపు 20వేల రోజులు పనులు చేశారు.

ఆత్మీయ భరోసాపై నీలినీడలు

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో సమయంలో ఇచ్చిన హామీ మేరకు భూమిలేని నిరుపేదలకు ఏడాదికి రూ.12వేల చొప్పున ఇందిరమ్మ ఆత్మీయ భరోసాను అమలు చేస్తోంది. గతనెలలో జరిగిన గ్రామసభల్లో లబ్ధిదారులకు ఎంపిక చేశారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో కనీసం 20 రోజులు పనులు చేసి రైతు భరోసా తీసుకోని పేదలకు ఇందుకు ఎంపిక చేశారు. అశ్వారావుపేటలో 108మంది, పేరాయిగూడెంలో 115 మంది, గుర్రాలచెరువులో 41మందిని ఈపథకానికి ఎంపిక చేశారు. ఈపథకానికి సంబంధించి నగదును త్వరలో బ్యాంకుల్లో జమ చేస్తామని తెలిపారు. దీంతో ఆయా పంచాయతీల్లో లబ్ధిదారుల్లో ఎనలేని ఆనందం కలిగింది. అయితే తాజాగా ఉపాధి పనులు నిలిపివేయటంతో ఆత్మీయ భరోసాపై కూడా నీలినీడలు కమ్ముకున్నాయి.

రైతులకు రాయితీలు బంద్

ఉపాధిహామీ పథకం ద్వారా అన్నదాతలకు అనేక పథకాలను అమలు చేస్తున్నారు. ప్రస్తుతం మునగసాగుకు ఎకరానికి మొక్కలు వేయటానికి, ఇతర ఖర్చులకు ఏడాదికి రూ.1.14లక్షలు ఇస్తున్నారు. పామాయిల్ మొక్కలు వేయటానికి, నిర్వహణ ఖర్చులకు, గుంతలు తీయటం ఇలా మూడేళ్లకు ఎకరానికి రూ2లక్షల వరకు రైతులకు అందుతుంది. గేదెలు పెంచటానికి అవసరమైన షెడ్లు వేసుకోవటానికి రూ.70వేలను అందిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో వేరే పథకాలను అమలు చేస్తున్నారు. తాజాగా పనులు ఆగిపోవటంతో ఈమూడు పంచాయతీల్లో అన్నదాతలకు ఉపాధిహామీ పథకం ద్వారా కలిగే ప్రయోజనాలు శూన్యంగానే ఉంటుంది. రైతులు తమ సొంత నిధులతోనే పనులు చేసుకోవాల్సి ఉంటుంది.

ఇతర పథకాలకూ బ్రేక్...

పంచాయతీల్లో మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.12వేలను, ఇంకుడు గుంతల నిర్మాణానికి రూ.6500 అందిస్తోంది. ఇవి కాకుండా పంచాయతీల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.కోట్లను వెచ్చిస్తున్నారు. గతనెలలో పేరాయిగూడెం పంచాయతీలో దాదాపు రూ.1.54కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. తాజాగా ఈపథకాలు అన్నీ నిలిచిపోనున్నాయి. అయితే అర్బన్ ప్రాంతాల్లో అమలు చేసే స్వచ్ఛతా మిషన్ ద్వారా మరుగుదొడ్ల నిర్మాణానికి అవకాశం ఉన్నా మిగిలిన పథకాలు కొండెక్కినట్లే.

అర్బన్ పథకాలు దరిచేరితేనే ప్రయోజనం

మునిసిపాలిటీల్లో కూడా ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. సెర్ప్ స్థానంలో మెప్మాను అమలు చేస్తున్నది. దీని ద్వారా మహిళలకు అనేక రకాల ప్రయోజనాలు సమకూరేలా చేయవచ్చు. ప్రస్తుతం ఉపాధిలో మహిళలకు కూడా పనులు లేకపోవటంతో మెప్మా ద్వారా ఆర్థిక అభివృద్ధికి బాటలు వేయవచ్చు. పురుష కూలీలకు పూర్తిగా సహకారం ఉండదు. దీంతో పాటు మునిసిపాలిటీకి వచ్చే నిధులతో రోడ్లు, ఇతర పనులు చేపట్టవచ్చు. అయితే ప్రభుత్వం నుంచి నిధుల రాక అంతంత మాత్రంగానే ఉంటుండటంతో ఏస్థాయిలో పనులు చేపడతారనేదానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

పనులు నిలిపివేశాం

రామచంద్రరావు, ఏపీవో, ఈజీఎస్

అశ్వారావుపేట మునిసిపాలిటీగా ఏర్పడటంతో అశ్వారావుపేట, గుర్రాలచెరువు, పేరాయిగూడెం పంచాయతీల్లో ఫిబ్రవరి నుంచి ఉపాధిపనులను జిల్లా అధికారుల ఆదేశాల మేరకు ఆపివేశాం. రైతులకు సంబంధించిన పథకాలు ఆగిపోతాయి. అర్బన్ ప్రాంతం స్కీమ్‌ల ద్వారా పేదలు లబ్ధి పొందే అవకాశం ఉంటుంది.

పాల్వంచ టూ కుంభమేళా

సైకిల్‌పై బయలుదేరిన పర్యావరణ ప్రేమికుడు కృష్ణ


పర్యావరణ ప్రేమికుడికి వీడ్కోలు పలుకుతున్న స్థానికులు

పాల్వంచ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పాల్వంచకు చెందిన గూడవల్లి కృష్ణ పర్యావరణ హితంగా ఆలోచిస్తూ, ఆచరిస్తూ వేలమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. మణుగూరు బస్‌డిపోలో కండక్టర్‌గా పదవీ విరమణ చేశారు. కాలుష్యాన్ని తగ్గించడానికి కృ కృష్ణ సైకిల్‌పై ప్రయాణానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. తాను నమ్మిన సిద్ధాంతాన్ని అందరికీ చెప్పాలని నిశ్చయించుకుని ఓ దీక్షలా సైకిల్ యాత్ర చేస్తున్నారు. ప్రతి రాష్ట్రంలోనూ సైకిల్ యాత్ర చేస్తూ పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఉద్యోగ ధర్మం నిర్వహిస్తూనే 2012 నుంచి 2024 వరకు దేశం నలుమూలలకు సైకిల్‌పై ప్రయాణం చేశారు. ఇప్పటికే 41 వేల కిలోమీటర్ల ప్రయాణంలో ఎన్నో ప్రయాసలను అధిగమించారు. తాజాగా పాల్వంచ నుంచి ఉత్తర్‌ప్రదేశ్‌లో జరుగుతున్న కుంభమేళాకు సైకిల్‌యాత్ర చేపట్టారు. ఇది దాదాపు 15 రోజుల ప్రయాణమని, బహుశా ఇది తన చివరి సైకిల్ యాత్ర అని పేర్కొన్న కృష్ణ, శనివారం పాల్వంచ అయ్యప్ప దేవస్థానం నుంచి యాత్రను ప్రారంభించారు.

ఒకే ఈతలో రెండు దూడలు

- చూసేందుకు ఆసక్తి కనబర్చిన జనం
- గుండెపూడిలో అరుదైన సంఘటన


రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు

జూలూరుపాడు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఒక ఆవుకు ఒక దూడ జన్మించడం సహజం. రెండు దూడలు ఒకేసారి జన్మిస్తే ఆశ్చర్యం కలిగించక మానదు. మండలంలోని గుండెపూడి గ్రామంలో గాదె మల్లయ్యకు చెందిన ఆవు శనివారం తెల్లవారుఝామున రెండు కోడెదూడలకు జన్మనిచ్చింది. అరుదైన సంఘటన తెల్లవారేసరికి అందరికి తెలిసింది. దీంతో పలువురు రైతులు, ప్రజలు మల్లయ్య ఇంటిని సందర్శించి కోడెదూడలను చూశారు. ప్రత్యేకమైన జన్యుపరమైన మార్పుల వల్ల ఇలా కవలల ప్రసవం జరుగుతుందని పలువురు పశువైద్య నిపుణులు చెబుతున్నారు. ఆవు కట్టిన 40వ రోజున జరాయు పొరల కలయిక జరుగుతుందని, ఆ తర్వాత రెండు పిండాల ద్రవాలు మిశ్రమంగా ఉంటాయని తెలిపారు. ఇది యాంటిజెన్‌ల మార్పిడికి కారణమువుందని తెలిపారు.

రేపటి నుంచి డీఏఈ క్రీడా, సాంస్కృతిక పోటీలు

- ప్లాంట్ జీఎం హెచ్‌కే శర్మ నేతృత్వంలో ఏర్పాట్లు
- 8 కేంద్రాల నుంచి 200 మంది క్రీడాకారులు



అశ్వాపురం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): భారత అణుశక్తి విభాగం 39వ ఇంటర్ డీఏఈ(డిపార్ట్‌మెంట్ ఆఫ్ అటమిక్ ఎనర్జీ) క్రీడా, సాంస్కృతిక పోటీలు అశ్వాపురం గౌతమీనగర్ కాలనీలోని రిక్రియేషన్ క్లబ్‌లో ఈనెల 10న ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం హెవీవాటర్ ప్లాంట్ జీఎం హెచ్‌కే శర్మ నేతృత్వంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. క్రీడా, సాంస్కృతిక పోటీల్లో భాగంగా ఈఏడాది బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఈపోటీలకు దేశ వ్యాప్తంగా ఉన్న ఎనిమిది అణుశక్తి యూనిట్లనుంచి దాదాపు 200మంది క్రీడా కారులు హాజరుకానున్నారు. క్రీడాకారులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా జీఎం నేతృత్వంలోని కమిటీలు పనిచేస్తున్నాయి. క్రీడాకారులకు భోజననివాస వసతులు కల్పించనున్నారు. ప్రారంభ పోటీలకు అణుశక్తి విభాగం చైర్మన్ దినేష్‌కుమార్ శుక్లా, హెవీవాటర్ బోర్డు చైర్మన్ ఎస్.సత్యకుమార్ ముఖ్య అతిథిలుగా హాజరుకానున్నారు. ఈపోటీలు ఈనెల 14న ముగియనున్నాయి.

తీరంలో 'ఇసుక తుపాను'

- గోదావరి, కిన్నెరసాని నదుల వెంట అనధికార ర్యాంపులు
- వట్టిపోతున్న జీవనదులు
- కలెక్టర్ మౌఖిక ఆదేశాలున్నాయని బుకాయింపు
- అధికారుల తీరుపై విమర్శల వెల్లువ

కొత్తగూడెంఅర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): గోదావరి, కిన్నెరసాని జీవనదుల తీరం వెంబడి ఇసుక తోడేళ్లు తిరుగుతున్నాయి. అనధికార ర్యాంపులు ప్రారంభించి యూనిట్ ఇసుకను రూ.1000 నుంచి 2వేల వరకు విక్రయిస్తున్నారు. నిత్యం వందలాది ట్రాక్టర్లు ద్వారా ఇసుకను తరలిస్తున్నారు. స్థానికులు నిలదీస్తే కలెక్టర్ మౌఖిక ఆదేశాలతో ర్యాంపులు నడుపుతున్నట్లు కిందిస్థాయి అధికారయంత్రాంగం సెలవిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

అధికారుల వత్తాసు..?

జిల్లాలో అనేకచోట్ల అనధికారికంగా గోదావరి, కిన్నెరసాని, ముర్రేడువాగులను గుల్లచేస్తున్నారు. కలెక్టర్, సబ్‌కలెక్టర్, ఆర్డీవో మౌఖిక ఆదేశాల పేరుతో ఇసుకను మింగేస్తున్నారన్న విమర్శలున్నాయి. అధికారపార్టీ నాయకుల అండదండలతో ఇసుక తరలుతోంది. నేతలు సూత్రధారులగా, అధికారులు పాత్రదారుగా ఇసుక దోపిడీకి పాల్పడుతున్నారు.

మౌఖిక ఆదేశాల ట్రెండ్...

అభివృద్ధి పనులకు, గృహ అవసరాలకోసమని ఇసుకను తోడేస్తున్నారు. నిజంగా అవసరమైతే పర్యావరణ ఇబ్బందులు లేనిచోట అధికారిక ఉత్తర్వులతో ఇసుక ర్యాంపులు ఏర్పాటుచేయాలి. కానీ అవసరాల ముసుగులో అధికార పార్టీ నేతలకు లబ్ధి చేకూర్చడం కోసం మౌఖిక ఆదేశాల పేరుతో ఇష్టారీతిన ర్యాంపులు నడుపుతున్నారు. ఎక్కడ లేనివిధంగా జిల్లాలో మౌఖిక ఆదేశాల ట్రెండ్ నడుస్తోంది. మౌఖిక ఆదేశాలని ఎటువంటి ఉత్తర్వులు లేకుండా అధికారులే అక్రమ తవ్వకాలకు తెరలేపడం విచిత్రంగా ఉంది. జిల్లాలోని ముర్రేడువాగు, కిన్నెరసాని, గోదావరి ఇసుకకు డిమాండ్ ఉండటంతో కొత్తగూడెం చుట్టుపక్కల మండలాలైన లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, పాల్వంచ, ములకలపల్లి, బూర్గంపాడు, భద్రాచలం, మణుగూరు, అశ్వాపురం, పినపాక, ఏడూళ్లబయ్యారం, అళ్లపల్లి, గుండాల గ్రామాల్లోని నదులు, వాగుల నుంచి నేరుగా ఇసుకను అక్రమ రవాణా చేస్తున్నారు.

అధికారులు అభాసుపాలు

ఇసుక అక్రమ తవ్వకాల విషయంలో రెవెన్యూ, పోలీస్, మైనింగ్, అటవీ శాఖలు అభాసుపాలు అవుతున్నాయి. స్థానికంగా అనుమతి ఉన్నా రీచ్‌లు లేకపోవడంతో జిల్లాలో గోదావరి తీరప్రాంతాలతో పాటు ముర్రేడువాగు, కిన్నెరసాని వాగుల నుంచి పెద్ద ఎత్తున ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారు. దీనికి తోడు ఆయా శాఖల అధికారులకు భారీగా ముడుపులు అందుతుండటంతో అటువైపు కన్నెత్తి చూడటంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆడపాదడపా తనిఖీలు జరుపుతూ కేసులు నమోదు చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టలేకపోతున్నారు. ఈ దందాపై ఉన్నతస్థాయి అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


ములకలపల్లిలో అనధికార ఇసుక ర్యాంపు


ముర్రేడువాగు ఒడ్డున ఉన్న ఇసుక నిల్వలు


ఎక్స్‌కవేటర్, లారీని సీజ్ చేసిన రెవెన్యూ అధికారులు


పోటీలను ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకురాలు లక్ష్మి

నాలుగు జిల్లాల స్థాయి క్రికెట్ పోటీలు

ఇల్లెందు టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం, వరంగల్, నల్లొండ, మహబూబ్‌నగర్ జిల్లాల స్థాయి క్రికెట్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. పరుశురాం యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ క్రీడాపోటీలను ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సతీమణి కోరం లక్ష్మి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ యువకులు క్రీడల పట్ల మక్కువ ప్రదర్శించాలని కోరారు. గెలుపు, ఓటములతో సంబంధం లేకుండ క్రీడల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం క్రీడలను ఎంతో ప్రోత్సహిస్తుందని యువకులు నిత్యం క్రీడల సాధన చేపట్టాలని కోరారు. శరీర దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని, క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ యదళ్లపల్లి అనసూర్య, మాజీ సర్పంచ్ పాయం స్వాతి, మహిళ నాయకురాలు మడుగు వెంకటలక్ష్మి, కాంగ్రెస్ నాయకులు మడుగు సాంబమూర్తి, బోళ్ల సూర్యం, పరుశురాం యూత్ నాయకులు బొల్లి రాజు, శేఖర్, పెద్దినేని హరినాథబాబు, మార్కెట్ రాజు, జాన్సన్, హైజాక్,అలిబాయి, మేకల నాగేశ్వరరావు, అజేయ్ తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండోలో మెరిసిన హర్ష



ఆళ్లపల్లి,ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఆళ్లపల్లి మండలానికి చెందిన గిరిజన ఆణిముత్యం పాయం హర్షప్రద తెలంగాణకు కీర్తి తీసుకవచ్చింది. డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ క్రీడల్లో తైక్వాండోలో అండర్ 73కేజీల విభాగంలో హర్షప్రద ఏపీ యువతిపై క్వార్టర్స్ ఫైనల్‌లో విజయం సాధించి, సెమీస్‌లో ఉత్తరాఖండ్ క్రీడాకారిణిపై విజయం సాధించింది. ఫైనల్‌లో చండీగఢ్ క్రీడాకారిణిపై గట్టి పోటీ ఇచ్చి, సిల్వర్ మెడల్ దక్కించుకుంది. పతకం సాధించటం పట్ల హర్షప్రద తల్లితండ్రులు పాయం పోతయ్య, రమాదేవి హర్షవ్యక్తం చేశారు.

సింగరేణిలో పీఆర్‌పీ చెల్లించాలి

- సీఎండీకు అధికారుల సంఘం వినతి


వినతిపత్రం సమర్పిస్తున్న సింగరేణి అధికారులు

ఇల్లెందు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ కంపెనీ పురోభివృద్ధికి, ఉత్పత్తి లక్ష్యాలసాధనకు అవిశ్రాంతంగా కృషిచేస్తున్న అధికారులకు వెంటనే ఫెర్ఫార్మెన్స్ రిలేటెడ్(పీఆర్‌పీ) చెల్లించాలని కోల్‌మైన్స్ ఆఫీసర్ల అసోసియేషన్ ఆఫ్ ఇండియా(సీఎంఓఏఐ) ఇల్లెందు ఏరియా అధికారులు సింగరేణి కాలరీస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఏరియా ఇంచార్జి జనరల్ మేనేజర్ ద్వారా శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అధికారుల సంఘం అధ్యక్షుడు శివప్రసాద్ మాట్లాడుతూ కోల్ ఇండియాలో 2022-2023కు చెందిన అధికారులకు పీఆర్‌పీ చెల్లింపులు 2024 జూన్ నెలలోనే చెల్లించారని, కానీ సింగరేణిసంస్థ అధికారులకు నేటివరకు పీఆర్‌పీ చెల్లించలేదని తెలిపారు. ఫలితంగా సంగరేణిసంస్థ అధికారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరసింహారావు, గిరిధర్‌రావు, మోహనరావు, దిలీప్, రామస్వామి, శ్రీనివాస్, మధుబాబు, పవన్ పాల్గొన్నారు.

క్రైం సమాచారం

విద్యుదాఘాతంతో మహిళ మృతి

ములకలపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుబ్బన్నపల్లి గ్రామానికి చెందిన బండి వెంకటమ్మ (45) శుక్రవారం రాత్రి విద్యుత్ వైరు తెగి మంచంపై పడటంతో విద్యుత్‌షాక్ తగిలి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యుత్ వైరు తెగి మంచం మీద పడుకున్న ఆమెపై పడి పూర్తిగా కాలిపోయిమృతి చెందిందని ఇంటి పక్క వారు చూసి పోలీసులకు తెలిపారన్నారు. శనివారం కుమారుడు రాకేష్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థి కన్నుమూత



పెనుబల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఖమ్మంలో చికిత్స పొందుతున్న బీటెక్ విద్యార్థి రావిలాల పవన్‌సాయి(18) శనివారం మృతిచెందాడు. మండాలపాడు గ్రామానికి చెందిన పవన్‌సాయి తన చెల్లెలను బస్సు ఎక్కించేందుకు ద్విచక్రవాహనంపై వచ్చి తిరుగుప్రయాణంలో రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పవన్‌సాయి ఖమ్మం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈమేరకు వీఎంబంజర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో గంగారం సెక్రటరీ..



సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మండలం బీ.గంగారం గ్రామ పంచాయతీ కార్యదర్శి జినుగు సీతారాములు(53) శనివారం మృతిచెందారు. గత కొంతకాలంగా ఆయన కిడ్నీ సంబందిత వ్యాధితో బాధపడుతున్నారు. శనివారం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకునేందుకు వెళ్లారు. డయాలసిస్ చేసేందుకు సిబ్బంది ఏర్పాట్లు చేస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు ప్రకటించారు. సీతారాములు స్వస్థలం కల్లూరు మేజర్ పంచాయితీ పరిధిలోని విద్యానగర్ (సంజీవయ్య నగర్). ఆయన మృతదేహన్ని దేహన్ని కల్లూరుకు తరలించారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు.

బైక్ అదుపుతప్పి యువకుడు..

నేలకొండపల్లి, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనంపై నుంచి పడి యువకుడు మృతి చెందిన సంఘటన శనివారం తెల్లవారుఝామున మండల పరిధిలోని గువ్వలగూడెం సమీపంలోని గంగమ్మ గుడి సమీపంలో జరిగింది. విజయవాడ ప్రసాదంపాడుకు చెందిన షేక్ రజాక్(35) తన స్నేహితుడి ద్విచక్రవాహనంపై హైదరాబాద్‌లోని సైనిక్‌పురిలో ఉన్న తన అక్క పుట్టినరోజు వేడుకలకు రెండు రోజుల క్రితం వెళ్లాడు. ఫంక్షన్ పూర్తయ్యాక శుక్రవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై తిరిగి విజయవాడకు బయలుదేరాడు. ఈ క్రమంలో నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం సమీపంలోని గంగమ్మ గుడి సమీపంలో బైక్ అదుపుతప్పింది. పక్కనే ఉన్న పంటకాల్వకు గుద్దుకుని పడిపోయాడు. హైవే పెట్రోలింగ్ సిబ్బంది గమనించి నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రజాక్ అప్పటికే మృతి చెందాడు. మృతుడు అవివాహితుడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు శనివారం ఉదయం నేలకొండపల్లి ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడి సోదరుడు నాగావలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పట్టుబడ్డ బైక్‌ల చోరీ నిందితుడు

ఖమ్మం క్రైం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని జమ్మిబండ వద్ద శనివారం నిర్వహించిన వాహనాల తనిఖీలలో ఓ ద్విచక్ర వాహనాల దొంగను అరెస్ట్‌చేసినట్లు వన్‌టౌన్ సీఐ ఉదయ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రిక్కాబజార్ హజరయ్య కాలనీకి చెందిన పాలడుగు విజయ్ అను వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించటంతో విచారించగా స్టేషన్‌రోడ్‌లో ఓ మోటార్ సైకిల్‌ను దొంగిలించినట్లు ఒప్పుకున్నాడని, దీంతో నిందుతుడిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. పలు చోరీ కేసులలో నిందితుడుగా ఉన్నాడని సీఐ ప్రకటనలో తెలిపారు.

ఉద్యోగం ఇస్తారా.. లేదా..?

విద్యుత్ సబ్‌స్టేషన్ గేటు ముందు మట్టిపోసిన స్థల దాత

కారేపల్లి, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బాట్యనగర్‌తండాలో 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం ఏర్పాటుకు స్థలం ఇచ్చిన దాత, తన కుంటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సబ్‌స్టేషన్ గేటు ముందు అడ్డుగా మట్టిని తోలించారు. 2017లో సబ్‌స్టేషన్ ఏర్పాటు కోసం స్థల సేకరణలో భాగంగా గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ స్థలాన్ని దానంగా ఇచ్చారు. అదేసమయంలోనే సబ్‌స్టేషన్‌లో ఆమెకు స్వీపర్‌పోస్టు ఇస్తామని అప్పటి అధికారులు హామీ ఇచ్చారు. సబ్‌స్టేషన్ నిర్మాణం అయ్యాక స్వీపర్ పోస్టు ఇవ్వడానికి ఎలాంటి అవకాశంలేదని అధికారులు తేల్చిచెప్పారు. విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభానికి అప్పటి మంత్రి తుమ్మలనాగేశ్వరరావు వచ్చారు. ఆసమయంలో లక్ష్మి ఆందోళనకు దిగారు. జోక్యం చేసుకున్న అప్పటి వైరా ఎమ్మెల్యే బాణోత్ మదన్‌లాల్ సంబంధిత అధికారులతో మాట్లాడారు. అయినా ఉద్యోగం ఇచ్చే అవకాశం లేదని అధికారులు తెల్పడంతో, మదన్‌లాల్ స్థల దాతకు నెలనెల కొంతనగదును అందజేశారు. ఆయన ఓటమి తర్వాత నగదు ఇవ్వడం ఆగిపోయింది. అప్పటి నుంచి ఆమె కార్యాలయం చుట్టు తిరుగుతూనే ఉన్నారు. శుక్రవారం కలెక్టర్‌ను కూడా కలిశారు. శనివారం ఉదయం గేటు ముందు సిబ్బంది లోనికి వెళ్లకుండా ట్రాక్టర్‌తో మట్టిని తోలించారు. విషయం తెలుసుకున్న ఏడీఈ ఆనంద్, ఏఈ సుధాకర్ రెడ్డి ఘటనస్థలానికి చేరుకుని మట్టినితొలగించారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు.


సబ్‌స్టేషన్ ఎదురుగా పోసిన మట్టిని పక్కకు నెట్టివేసిన అధికారులు

ఉచిత శిక్షణకు దరఖాస్తులకు నేడు ఆఖరు

ఖమ్మం ఖానాపురంహవేలి, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని బీసీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్‌సీ బ్యాంకింగ్, రిక్రూట్‌మెంట్ ఫౌండేషన్ కోర్సు ఉచిత శిక్షణకు ఆదివారం వరకు దరఖాస్తుల చేసుకోవచ్చని స్టడీ సర్కిల్ డైరెక్టర్ జి. శ్రీలత తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని డిగ్రీ పాసైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు ఫిబ్రవరి 9వ తేదీలోగా ఆన్ లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. తరగతులు ఫిబ్రవరి 15 నుంచి ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నాలుగు నెలల శిక్షణ అందిస్తామని శ్రీలత వివరించారు.

అనుమానాస్పద స్థితిలో ఆటో డ్రైవర్ మృతి

కొణిజర్ల, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): అనుమానస్పదంతో ఆటోడ్రైవర్ మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గోపవరం సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు దగ్గర శనివారం చోటు చేసుకుంది. ఎస్ఐ సూరజ్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. చింతకాని మండల నాగిలిగొండ గ్రామానికి చెందిన చాట్ల బిక్షం(45) అనే వ్యక్తి కొణిజర్ల నుంచి నాగిలిగొండ వరకు ప్రతి రోజు ఆటోనడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రోజువారిలాగానే వెళ్లిన బిక్షం శుక్రవారం రాత్రివరకు కూడా ఇంటికి రాలేదు. శనివారం ఉదయం బిక్షం రోడ్డు పక్కన చనిపోయి ఉన్నాడనే సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు అక్కడకు చేరుకున్నారు. మృతుడి ఒంటిపై. తలపై గాయాలు ఉన్నాయి. పథకం ప్రకారమే చంపి ఉంటారని కుటుంబ సభ్యులు భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య సుజాత, కుమారులు శ్రీరామ్, రామ్‌చరణ్ ఉన్నారు. మృతదేహం పడి ఉన్న స్థలాన్ని ఏసీపీ రహమాన్, సీఐ సాగర్, కొణిజర్ల, చింతకాని ఎస్ఐ లు పరిశీలించారు.


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ

కొలతల్లో తిరకాసు

ఇష్టానుసారంగా రోడ్డు విస్తరణ
నిరసనకు దిగిన ముస్లిం కమిటీ

అశ్వారావుపేట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట పట్టణంలోని రింగ్‌రోడ్డులో విస్తరణ పనుల కొలతల్లో ఒక్కోచోట ఒక్కోలా చేపడుతున్నారంటూ ముస్లింకమిటీ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నిరసన కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు మొగళ్లపు చెన్నకేశవరావు, జేస్ట సత్యనారాయణ, టీడీపీ నాయకులు కట్రం స్వామి, బీఆర్ఎస్ నాయకులు జల్లిపల్లి శ్రీరామమూర్తి, సత్యవరపు సంపూర్ణ, సీపీఐఎంఎల్ నాయకులు జి. ప్రభాకర్, సీపీఐ జిల్లా నాయకులు సయ్యద్ సలీం తదితరులు సంఘీభావం తెలిపారు. పట్టణమంతా ఏ విధమైన కొలతల ప్రకారం రోడ్డు విస్తరణ చేపట్టారో రింగ్‌రోడ్డులో కూఆ అదే విధంగా చేపట్టాలని డిమాండ్ చేశారు. ఆర్అండ్‌బీ అధికారులు పక్షపాతంతో వ్యవహరిస్తూ పేదలపై ప్రతాపం చూపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు చేయడానికి వచ్చిన ఆర్అండ్‌బీ అధికారులను నిలదీశారు. తక్షణమే రోడ్డు విస్తరణ పనుల్లో అసమానతలు లేకుండా పనులు సజావుగా చేపట్టాలని లేకుంటే నిరసనలు తీవ్ర తరమవుతాయని హెచ్చరించారు. ముస్లిం కమిటీ మండల అధ్యక్షుడు వలీ పాషా మాట్లాడుతూ మసీదులు, దేవాలయాలు అని కూడ చూడకుండా విస్తరణ పనుల కొలతలు ఇష్టానురాజ్యంగా చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎండీ నజీర్, ఆసిఫ్, ఉస్మాన్,ఆలీమ్, రఫీ, జలాల్, సాజిద్ పాషా, పాషా తదితరులు పాల్గొన్నారు.


నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లిం కమిటీ నాయకులు

ఢిల్లీ ఎన్నికల ఫలితాలు ఫాసిస్ట్ శక్తులకు ఊతం

- మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు

ఖమ్మం సంక్షేమ విభాగం, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఫాసిస్ట్ శక్తులకు ఊతం కాగా ప్రజాస్వామ్యశక్తులకు అశనిపాతంగా ఉందని ఫాసిస్ట్ శక్తుల ఎత్తుగడలు విజయం సాధించాయని, ప్రజాస్వామ్య, లౌకికశక్తులకు నష్టం వాటిల్లిందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో నిరుద్యోగులు, మధ్య తరగతి ప్రజలు, ఉద్యోగ వర్గాల ఫాసిస్ట్ విధానాలకు ఆకర్షితులైతున్నారని ఆరోపించారు. అబద్ధపు ప్రచారాలను తిప్పికొట్టటంలో ప్రజాస్వామ్యవాదులు విఫలం చెందటంతో ఇటువంటి ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. కేజ్రీవాల్ ప్రభుత్వాన్ని అవినీతి మయంగా ప్రచారం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అన్ని రకాల శక్తులను వాడుకుంటుందన్నారు.





మంత్రి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిసి కమ్మమహాజన సంఘం సభ్యులు

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	16 రూ.
వంకాయ	28
గుత్తి వంకాయ	30
బీరకాయ	48
పచ్చిమిర్చి	28
బెండకాయ	44
బెండకాయ	48
పొట్లకాయ	38
దోసకాయ	38-38
చిక్కుడు	38
నాటుచిక్కుడు	70
గోరుచిక్కుడు	54
క్యాబేజీ	20
దొండ	28-36
సొరకాయ	18
క్యారెట్	38
క్యాప్సికం	48
ఆలుగడ్డ	30
ఉల్లిగడ్డ	35-40
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	150
కొత్తిమీర కట్ట	10

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	తండేల్
శ్రీనివాస:	డాకూ మహరాజ్
సాయిరాం:	పట్టుదల
కేపీఎస్:	ఒక పథకం ప్రకారం
తిరుమల:	సంక్రాంతికి వస్తున్నాం
సినీగెలాక్సీ:	డియర్ కృష్ణా

తరచూ విభాగాల మార్పుతో తిప్పలు

- కేఎంసీలో రెండు ప్రాంతాల్లో రెవెన్యూ విభాగాలు
- ప్రజలు,కార్పొరేటర్లకు ఇబ్బందులు





రెండో ఫ్లోర్‌లో ఆర్వో చాంబర్, గ్రౌండ్ ఫ్లోర్‌లో ఆర్ఐల చాంబర్

ఖమ్మంసంక్షేమవిభాగం,ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల కార్యాలయాలు తరచూ మరుస్తుండటంతో ప్రజలు, కార్పొరేటర్లు ఇబ్బందిపడుతున్నారు. ఖమ్మంనగర పాలక సంస్థలో రెవెన్యూ అధికారుల తీరుఇటు ప్రజలకు, అటు కార్పొరేటర్లకు ఒక్కపక్కాన అర్థం కావటం లేదు. కేఎంసీ భవనం నిర్మాణం తర్వాత ఒక క్రమ పద్ధతిలో రెవెన్యూ, పారిశుధ్యం, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్,ఎకౌంట్స్,ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగాలను ఏర్పాటు చేశారు.ప్రజలతో నేరుగా సంబంధాలుండే పారిశుధ్యం, రెవెన్యూ విభాగాలను గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేశారు. కానీ రెవెన్యూ విభాగంలోని రెవెన్యూ, ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ అధికారి మాత్రం తరుచూ కార్యాలయాలను మారుస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత కోసం ఒక సెక్షన్ విభాగం పర్యవేక్షక అధికారి నుంచి ఉద్యోగుల వరకు ఒకే ప్రాంతంలోనే ఉంటారు. ప్రజలకు సౌకర్యవంతంగా ఉండటంతో పాటుగా ఎప్పుడు ఆయా విభాగం ఉద్యోగులు పర్యవేక్షణ కోసం ఇలా ఏర్పాటు చేశారు.కేఎంసీ రెవెన్యూ విభాగంలోని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉండగా రెవెన్యూఅధికారి ఇటీవల రెండోఫ్లోర్‌కు వెళ్లారు. గతంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రెండో ఫ్లోర్‌లో ఉంటే సదరు అధికారి గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఉన్నారు. బిల్‌కలెక్టర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు సంబంధం లేకుండా ఆర్వో రెండోఫ్లోర్‌కు వెళ్లటంపై ఆరోపణలు వస్తున్నాయి. కేఎంసీకి వచ్చే ఫిర్యాదుల్లో 50శాతం మేరకు రెవెన్యూ విభాగం ఫిర్యాదులే ఉంటున్నాయి. కమిషనర్ స్పందించి రెవెన్యూ విభాగంలోని ఉద్యోగులు ఒకే ప్రాంతంలో ఉండేలా చూడాలని కార్పొరేటర్లు, ప్రజలు కోరుతున్నారు.

ముమ్మరంగా ఆదాయ వసూళ్లు

- ఈఏడాది ఆదాయ వసూళ్లు లక్ష్యం రూ.36 కోట్లు
- వచ్చింది రూ.19.5 కోట్లు
- కొంత ఫలితాన్నిచ్చిన స్పెషల్ డ్రైవ్



స్పెషల్ డ్రైవ్‌లో పాల్గొన్న ఆర్ఐ జ్యోతి

ఖమ్మంసంక్షేమవిభాగం,ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగర పాలక సంస్థ పరిధిలోని ఆదాయ వసూళ్ల స్పెషల్ డ్రైవ్ ముమ్మరంగా కొనసాగుతుంది. 2024-25వార్షిక ఆదాయ లక్ష్యం రూ.36కోట్లు కాగా ఇప్పటి వరకు రూ.19.5కోట్లు ఆదాయం వచ్చింది. దీంతో గత శనివారం నుంచి సోమవారం వరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కమిషనర్ అభిషేక్ అగస్త్య పర్యవేక్షణ చేయగా మూడు రోజుల్లో రూ.40 లక్షల ఆదాయం వరకు సమకూరింది. తర్వాత మంగళవారం నుంచి45 మంది ఉద్యోగులతో 20రెవెన్యూ వార్డుల్లో ఐదుగురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుతో సాధారణ స్పెషల్ డ్రైవ్‌లో ఆదాయ వసూళ్లను ఆర్వో శ్రీనివాసరావు పర్యవేక్షణలో కొనసాగిస్తున్నారు. దీంతో రోజుకు రూ.15లక్షల నుంచి రూ.17 లక్షల వరకు వసూళ్లు జరుగుతున్నాయి. మరికొంత కాలం పాటు కమిషనర్ పర్యవేక్షణలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించకపోతే లక్ష్యం నెరవేరటం గగనంగా కనిపిస్తోంది.

11న పదోతరగతి విద్యార్థులకు

నిపుణుల సలహాలు

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో 2024-25 విద్యాసంవత్సరంలో పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు నిపుణులచే మార్గదర్శనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ తెలిపారు. మంగళవారం ఉదయం 10:30నుంచి టీ-శాట్, యూట్యూబ్ ద్వారా విద్యార్థులకు, ఉపాధ్యాయులకు విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణా స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ఈవీ నర్సిరెడ్డి ప్రసంగించనున్నారని డీఈవో తెలిపారు. ఈకార్యక్రమాన్ని పదో తరగతి బోధించే ఉపాధ్యాయులు తప్పనిసరిగా వీక్షించాలని, లైవ్‌టెలికాస్ట్ సమయాల్లో విద్యార్థులు స్క్రీన్‌పై కనిపించే నెంబర్లకు ఫోన్‌చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు.

సమాజ అభివృద్ధిలో కీలకంగా ఉండాలి

- కమ్మ సంఘం ఔన్నత్యాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- మంత్రిని కలిసిన కమ్మమహాజన సంఘం సభ్యులు

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): సమాజఅభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తూ కమ్మజాతి ఔన్నత్యాన్ని పెంపొందించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఇటీవల ఏకగ్రీవంగా ఎన్నికైన కమ్మ మహాజనసంఘం కమిటీ సభ్యులు శనివారం మంత్రి తుమ్మలను క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో కమ్మ సంఘం సభ్యులు కీలకంగా ఉండాలని, ఎక్కడా ఎటువంటి పొరపాట్లు జరగకుండా సంఘం అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలన్నారు. ఐక్యంగా ఉంటూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. నూతనంగా ఏర్పడిన కమిటీ భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా ఉండాలన్నారు. సేవాకార్యక్రమాల ద్వారా దేశంలోనే సంఘానికి మంచి పేరుతేవాలన్నారు. ఈకార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, కమ్మమహాసనసంఘంనూతన అధ్యక్షుడు కొల్లు రఘుసత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి చావా రాము,వైస్‌ప్రెసిడెంట్ కర్నాటి రమాదేవి, జాయింట్ సెక్రటరి వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారి తుళ్లూరి నిర్మల, కార్యవర్గసభ్యులు మోతుకకూరి సత్యనారాయణ, కోలేటి నవీన్, మేదరమట్ల స్వరపరాణి, నల్లమల ఆనంద్, నంబూరి సత్యనారాయణ ప్రసాద్, పోతినేని భూమేశ్వరరావు, తుమ్మలపల్లి నాగేశ్వరరావు, సంఘం నాయకులు పునుకొల్లు రామబ్రహ్మం, రావూరి సైదుబాబు, రాంబాబు, తుళ్లూరి మురళీకృష్ణ, బండి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో మంత్రుల ప్రత్యేక పూజలు

నగరంలోని వీడియోస్‌కాలనీలోని శ్రీ సీతా సమేత రామచంద్రస్వామి ఆలయ 6వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ గుంటుపల్లి శ్రీనివాస్ ఆలయ ప్రధాన అర్చకులు మంత్రులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందించారు. వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి తిరుకళ్యాణం నిర్వహించారు.భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



మంత్రి పొంగులేటిని ఆశీర్వదిస్తున్న అర్చకులు

తుమ్మలకు సీపీఎం నాయకుల వినతి

ఖమ్మంసంక్షేమవిభాగం: ఖమ్మంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీపీఎం నాయకులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కోరారు. శనివారం మంత్రి క్యాంపు కార్యాలయంలో వై.శ్రీకాంత్,వై విక్రమ్ కలిసి పలు సమస్యలు వివరించారు. ఖమ్మంలో ట్రాఫిక్ పెరిగిన ప్రాంతాల్లో రహదారులు వెడల్పు చేయాలని కోరారు. అర్హత కలిగిన వారికి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇతర సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. నాయకులు ఎంఏ జబ్బార్, దొంగల తిరుపతిరావు, ఎస్కే మీరాసాహెబ్, భూక్యా శ్రీనివాసరావు, బొడపట్ల సుదర్శన్, శ్రీనివాసరావు, బత్తుల ఉపేంద్ర, నాగుల్‌మీరా, నాగసులోచన పాల్గొన్నారు.

విద్యావ్యవస్థ మెరుగు పడేందుకు కృషి

- ఎమ్మెల్సీ అభ్యర్థి సంగంరెడ్డి



మాట్లాడుతున్న సుందర్‌రాజ్ యాదవ్

ఖమ్మంచర్చికాంపౌండ్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యావ్యవస్థ దయనీయ పరిస్థితిలో ఉందని, విద్యావ్యవస్థను మెరుగుపరచడానికి , ఉపాధ్యాయుల సంక్షేమ అభివృద్ధికి కృషిచేస్తానని ఖమ్మం, వరంగల్, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీస్వతంత్ర అభ్యర్థి సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్ అన్నారు. శనివారం నగరంలోని అఖిలభారత యాదవ మహాసభ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విద్యావ్యవస్థ బాగుంటేనే దేశం బాగుపడుతుందని, దేశానికి అన్నంపెట్టే రైతన్న దేశసరిహద్దుల్లోని సైనికుడు,మానవ వనరులు తయారు చేసే ఉపాధ్యాయులు ముఖ్యమన్నారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకల వెంకటనర్సయ్యయాదవ్, చిత్తారు సింహాద్రి యాదవ్, ఎనిక వెంకటేశ్వరరావు, దుబాకుల వెంకటేశ్వర్లు, చేతుల నాగేశ్వరరావు, మొర్రిమేకల కోటయ్య, పోదిల సతీష్, బొమ్మిడి శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

తిరుమలాయపాలెం,ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రభుత్వం పేదలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను తెలిపారు. శనివారం తిరుమలాయపాలెంలో పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 10న ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపడుతున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వం అమలుకాని హామీలను ఇచ్చిందని, గద్దెనెక్కాక వాటిని విస్మరించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏ.నరసయ్య, టి.నాగేశ్వరరావు, బింగిరమేష్, మహీందర్, మంగతాయి తదితరులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆందోళన

చింతకాని, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట- దేవరపల్లి జాతీయరహదారిపై బస్వాపురం గ్రామం వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని రైతుల చేస్తున్న ఆందోళన రెండవ రోజు కొనసాగింది. శనివారం రైతులు చేస్తున్న ఆందోళనకు పలు పార్టీ రైతు సంఘం నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో రైతులు కన్నెబోయిన గోపి, బొడ్డు వెంకటరామారావు, నాగేశ్వరరావు, శ్రీనివాస్, చంద్రకాని నరసింహరావు, కోటేశ్వరరావు, పేరబోయిన రవి పాల్గొన్నారు.

నిధులున్నా.. నిర్మాణం సున్నా!

- ఏడాదిగా నిర్మాణానికి నోచుకోని గ్రంథాలయం
- రూ.2కోట్లు మంజూరైనా ప్రారంభంకాని పనులు
- గత ఏడాది జనవరి 12న కూలిన జిల్లా గ్రంథాలయ భవనం



గ్రంథాలయం నూతన భవనం నిర్మాణం చేయాల్సిన స్థలం

ఖమ్మంఖానాపురంహవేలి, ఫిబ్రవరి8: జిల్లా కేంద్రంలోని గ్రంథాలయం కూలటంతో ప్రభుత్వం నిధులు కేటాయించింది.. ఇది జరిగి ఏడాది గడచినా నేటికీ పనులు ప్రారంభం కాలేదు.. ఫలితంగా ఉద్యోగ సాధనే లక్ష్యంగా చదువుకుంటున్న నిరుద్యోగులకు ఇబ్బందికరంగా మారింది. ఖమ్మం నగరంలోని జిల్లా గ్రంథాలయం గతఏడాది జనవరి 12న ఉదయం 8:30కు ఒక్కసారిగా కుప్పకూలింది. సెలవు కావటంతో స్థానిక ప్రజలు, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులు లేకపోవటంతో ప్రాణ నష్టం తప్పింది. కూలిన భవనాన్ని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరావు పరిశీలించారు. వెంటనే శిథిలాలు తొలిగించి నూతన భవన నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.ఈనేపథ్యంలో 2024 అక్టోబరులో గ్రంథాలయ సంస్థ నుంచి రూ.2కోట్లు, మంత్రి నిధుల నుంచి రూ.80లక్షలు మంజూరు చేశారు.

అధికారుల సూచనల మేరకే

జిల్లా గ్రంథాలయం కూలిన ప్రాంతంలో కాక పాత మునిసిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసేవిధంగా ఆనాడు అధికారులు మంత్రి తుమ్మలకు సూచించారు. మంత్రి వెంటనే ఫైల్ సిద్ధం చేసి పంపాలని ఆదేశించారు. కానీ గ్రంథాలయ అధికారులు సిబ్బంది తక్కువగా ఉన్నారని రెండు చోట్ల గ్రంథాలయం ఉంటే సిబ్బంది కొరత అధికంగా ఉంటుందని వివరించారు. పాత భవనం కూలిన ప్రాంతంలోనే నూతన భవనాన్ని నిర్మించాలని మంత్రిని కోరారు. అందుకు మంత్రి అనుమతిస్తూ వెంటనే పనులు మెదలుపెట్టాలని ఆదేశించారు. ఈనేపథ్యంలో నిధులు మంజూరు చేశారు.

ఏడాదిగా ముందుకు కదలని ఫైలు

గ్రంథాలయ అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఏడాది దాటినా భవన నిర్మాణఫైల్ ముందుకు సాగటంలేదని తెలుస్తుంది.ఈభవనం 1950లో నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు సుమారు 73సంవత్సరాలు కావటంతో కూలిపోయింది. నిత్యం ఉదయం 8గంటలకే స్థానిక ప్రజల తోపాటు గ్రంథాలయానికి వచ్చే అభ్యర్థులు సుమారు 70నుంచి 80మంది వచ్చేవరని వారంతా రోజువారి పేపర్లతోపాటు గ్రంథాలయంలో పుస్తకాలను చదుతుంటారు.

మరో వారంలో అనుమతులు

గ్రంథాలయ నూతన భవన నిర్మాణ అనుమతులు మరో వారంలో రావొచ్చునని గ్రంథాలయ అధికారులు తెలిపారు. గ్రంథాలయ ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారుల బదిలీల కారణంగా అనుమతి పత్రాలు ఆలస్యం అయినట్లు తెలిపారు. ప్రస్తుతం అన్ని అనుమతులు వచ్చాయని ఫైల్ వారం రోజుల్లో ఖమ్మం చేరుకుంటుందని తెలిపారు. వచ్చిన వెంటనే పనులు మొదలు పెడుతామన్నారు.

ఆరోగ్య కేంద్రానికి భవనం కరువు

- సబ్ సెంటర్లో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం నడుస్తున్నవైనం
- ఇబ్బందులు పడుతున్న రోగులు, సిబ్బంది
- నూతన భవనాన్ని నిర్మించాలని వినతి
- పట్టించుకోని అధికారులు



ఆరోగ్య ఉపకేంద్రం సబ్‌సెంటర్లో నడుస్తున్న దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మధిర రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం దెందుకూరు గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ) కి సొంత భవనం లేదు. గ్రామంలో గల ఆరోగ్య ఉపకేంద్రం(సబ్‌సెంటర్)లోని ఇరుకు గదుల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నడుపుతున్నారు. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, సిబ్బంది పలు ఇబ్బందులు పడుతున్నారు.

మధిర మండలంలో గతంలో మాటూరుపేటలో మాత్రమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆనాడు డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న మల్లు భట్టి విక్రమార్క 13 ఏళ్ల క్రితం దెందుకూరు గ్రామానికి మరో పీహెచ్‌సీని ఏర్పాటు చేయించారు. అంతేకాక ప్రభుత్వం రూ.40లక్షల నిధులు మంజూరు చేయించి భవన నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. అయితే శంకుస్థాపన చేసిన స్థలం పక్కనే ఓ రైతు తన భూమి కొంత ఉందని కోర్టును ఆశ్రయించడంతో ఈ భవన నిర్మాణం నిలిచిపోయింది. ఇక అప్పటి నుంచి ఇప్పటివరకు పీహెచ్‌సీ భవన నిర్మాణం ఆగిపోయింది. ఆనిధులు కూడా ఆతర్వాత వెనక్కి వెళ్లిపోయాయి.

దెందుకూరు పీహెచ్‌సీ పరిధిలో పది గ్రామాలు, ఆరు సబ్‌సెంటర్లు ఉన్నాయి. ఖమ్మంపాడు, మడుపల్లి, మహదేవపురం, దెందుకూరు, మధిర 12 సబ్‌సెంటర్లు ఉన్నాయి. ఈ సబ్‌సెంటర్ల పరిధిలో పది గ్రామాలతోపాటు మధిర పట్టణంలోని 8వార్డులు కూడా ఉన్నాయి. 33వేల జనాభా కలదు. ఇద్దరు డాక్టర్లు, సీహెచ్‌వోపాటు పలువురు సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు ఉన్నారు. ఆసుపత్రికి ప్రతినిత్యం ఓపీ అధికంగా ఉంటుంది. అత్యవసర సమయాల్లో డెలివరీలకు కూడా ఈ పీహెచ్‌సీలోనే చేస్తుంటారు. ఇంత ప్రాధాన్యత కలిగిన ఈ కేంద్రానికి సొంత భవనం లేక మూడు ఇరుకు గదుల సబ్‌సెంటర్లోనే నిర్వహిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

80సెంట్లు స్థలం ఇచ్చిన దాతలు...

గ్రామంలో మొదట శిలాఫలకం వేసిన స్థలం కోర్టు వివాదంలో ఉండటంతో గ్రామస్థులు, పలువురు దాతలు ముందుకొచ్చి 80సెంట్ల స్థలాన్ని దెందుకూరు పీహెచ్‌సీ భవన నిర్మాణానికి దానంగా ఇచ్చి రిజిస్ట్రేషన్ చేశారు. మూడున్నర సంవత్సరాల క్రితం 12మంది దాతలు 80సెంట్ల స్థలాన్ని కలిపి దానంగా ప్రభుత్వానికి అందజేశారు. తమ గ్రామపంచాయతీలో దాతలు ముందుకొచ్చి స్థలం ఇచ్చినప్పటికీ ప్రభుత్వాలు పీహెచ్‌సీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడం బాధాకరమని దాత లు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పీహెచ్‌సీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

రోగులు ఇబ్బందులు పడుతున్నారు..

● షేక్, గాలీబు, దెందుకూరు



తమ గ్రామం మేజర్ పంచాయతీ, ఆరువేల జనాభా ఉన్నారు. అంతే కాకుండా దెందుకూరు పీహెచ్‌సీ పది గ్రామాలకు కేంద్రంగా ఉంది. రోగులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. సిబ్బంది కూర్చోవడానికే ఉన్న గదులు సరిపోవడం లేదు. దాతలు ఇచ్చిన స్థలంలో నూతన భవన నిర్మాణాన్ని చేపట్టాలి.

భవన నిర్మాణం చేపట్టాలి

● కందుకూరు నాగబాబు, దెందుకూరు



తమ గ్రామపెద్దలు, దాతలు కలిపి పీహెచ్‌సీ భవన నిర్మాణానికి స్థలం ఇచ్చినా భవనం నిర్మించకపోవడం బాధాకరమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి. నూతన భవన నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయించాలి.

ఐక్యఉద్యమాలతోనే ఇళ్ల స్థలాల సాధన

- స్తంభాద్రి జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు సైదులు

ఖమ్మంచర్చికాంపౌండ్,ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): దశాబ్దాల జర్నలిస్టుల సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు జర్నలిస్టులు ఐక్యఉద్యమాలకు సిద్ధం కావాలని స్తంభాద్రి జర్నలిస్టు హౌజింగ్ సొసైటీ అధ్యక్షుడు కనకం సైదులు పిలుపునిచ్చారు. శనివారం ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు గుద్దేటి రమేష్‌బాబు ఆధ్వర్యంలో జరిగిన ఇళ్లస్థలాల సాధన యుద్ధభేరి సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం ఇళ్లస్థలాల కోసం ఎదురు చూస్తుండగా జరుగుతున్న పరిణామాలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు.మూడుప్రధాన యూనియన్లు, హౌజింగ్ సొసైటీ నాయకులతో పాటు ప్రెస్‌క్లబ్ కమిటీతో ఐక్యఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఐజేయూ ఉపాధ్యక్షుడు మొహినుద్దీన్, టీజేఎఫ్ నగర ఉపాధ్యక్షుడు అమరవరపు కోటేశ్వరరావు, సీనియర్ సబ్ ఎడిటర్ అచ్చిరెడ్డి, ప్రెస్‌క్లబ్ కోశాధికారి నామ పురుషోత్తం, గోపీ, ప్రధాన కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైరాలో ఆర్టీసీ బస్టాండ్

ప్రవేశ ద్వారాల మూసివేతపై నిరసన

వైరా, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): వైరా ఆర్టీసీ బస్టాండ్‌లోని రెండు ప్రధాన ప్రవేశ ద్వారాల మూసివేతను నిరసిస్తూ అఖిలపక్ష ఆధ్వర్యంలో శనివారం బస్టాండ్ ఆవరణంలో ఆందోళన చేశారు. ఈ ద్వారాల మూసివేతను ఎత్తివేసి యథావిధిగా బస్సుల రాకపోకలను పునరుద్ధరించాలని కోరుతూ స్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. 1978నుంచి నేటివరకు బస్టాండ్‌లోని నాలుగు ప్రవేశ ద్వారాల నుంచి బస్సుల రాకపోకలు సాగుతున్నాయని తెలిపారు. రెండు ద్వారాలు మూసివేయడం వలన మధిర రోడ్డులో అలాగే క్రాస్‌రోడ్డు వద్ద జాతీయ ప్రధాన రహదారిపై రద్దీ పెరిగి రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశముందని పేర్కొన్నారు. వెంటనే మూసివేసిన ద్వారాలను తిరిగి పునరుద్ధరించాలని వినతిపత్రంలో కోరారు. మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, సీపీఎం నాయకులు చింతనిప్పు చలపతిరావు, సుంకర సుధాకర్, మేరుగు రమణ, పారుపల్లి కృష్ణారావు, తాళ్లపల్లి కృష్ణ, అమరనేని కృష్ణ, ఇమ్మడి సుధీర్ పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రానికి భవనం కరువు

» సబ్ సెంటర్లో ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం నడుస్తున్న వైనం
» ఇబ్బందులు పడుతున్న రోగులు, సిబ్బంది
» నూతన భవనాన్ని నిర్మించాలని వినతి
» పట్టించుకోని అధికారులు

మధిర రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం దెందుకూరు గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)కి సొంత భవనం లేదు. గ్రామంలో గల ఆరోగ్య ఉపకేంద్రం(సబ్‌సెంటర్)లోని ఇరుకు గదుల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నడుపుతున్నారు. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, సిబ్బంది పలు ఇబ్బందులు పడుతున్నారు.

మధిర మండలంలో గతంలో మాటూరుపేటలో మాత్రమే ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉండేది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆనాడు డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న మల్లు భట్టి విక్రమార్క 13 ఏళ్ల క్రితం దెందుకూరు గ్రామానికి మరో పీహెచ్‌సీని ఏర్పాటు చేయించారు. అంతేకాక ప్రభుత్వం రూ.40లక్షల నిధులు మంజూరు చేయించి భవన నిర్మాణానికి శంకుస్థాపన కూడా చేశారు. అయితే శంకుస్థాపన చేసిన స్థలం పక్కనే ఓ రైతు తన భూమి కొంత ఉందని కోర్టును ఆశ్రయించడంతో ఈ భవన నిర్మాణం నిలిచిపోయింది. ఇక అప్పటి నుంచి ఇప్పటివరకు పీహెచ్‌సీ భవన నిర్మాణం ఆగిపోయింది. ఆనిధులు కూడా ఆతర్వాత వెనక్కి వెళ్లిపోయాయి.



ఆరోగ్య ఉపకేంద్రం సబ్‌సెంటర్లో నడుస్తున్న దెందుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

దెందుకూరు పీహెచ్‌సీ పరిధిలో పది గ్రామాలు, ఆరు సబ్‌సెంటర్లు ఉన్నాయి. ఖమ్మంపాడు, మడుపల్లి, మహదేవపురం, దెందుకూరు, మధిర 1,2 సబ్‌సెంటర్లు ఉన్నాయి. ఈ సబ్‌సెంటర్ల పరిధిలో పది గ్రామాలతోపాటు మధిర పట్టణంలోని 8వార్డులు కూడా ఉన్నాయి. 33వేల జనాభా కలదు. ఇద్దరు డాక్టర్లు, సీహెచ్‌వోపాటు పలువురు సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు ఉన్నారు. ఆసుపత్రికి ప్రతినిత్యం ఓపీ అధికంగా ఉంటుంది. అత్యవసర సమయాల్లో డెలివరీలకు కూడా ఈ పీహెచ్‌సీలోనే చేస్తుంటారు. ఇంత ప్రాధాన్యత కలిగిన ఈ కేంద్రానికి సొంత భవనం లేక మూడు ఇరుకు గదుల సబ్‌సెంటర్లోనే నిర్వహిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

80సెంట్లు స్థలం ఇచ్చిన దాతలు...

గ్రామంలో మొదట శిలాఫలకం వేసిన స్థలం కోర్టు వివాదంలో ఉండటంతో గ్రామస్థులు, పలువురు దాతలు ముందుకొచ్చి 80సెంట్ల స్థలాన్ని దెందుకూరు పీహెచ్‌సీ భవన నిర్మాణానికి దానంగా ఇచ్చి రిజిస్ట్రేషన్ చేశారు. మూడున్నర సంవత్సరాల క్రితం 12మంది దాతలు 80సెంట్ల స్థలాన్ని కలిపి దానంగా ప్రభుత్వానికి అందజేశారు. తమ గ్రామపంచాయతీలో దాతలు ముందుకొచ్చి స్థలం ఇచ్చినప్పటికీ ప్రభుత్వాలు పీహెచ్‌సీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయకపోవడం బాధాకరమని దాత లు, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ విషయాన్ని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులకు తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పీహెచ్‌సీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.

రోగులు ఇబ్బందులు పడుతున్నారు..

● షేక్, గాలీబు, దెందుకూరు



తమ గ్రామం మేజర్ పంచాయతీ, ఆరువేల జనాభా ఉన్నారు. అంతే కాకుండా దెందుకూరు పీహెచ్‌సీ పది గ్రామాలకు కేంద్రంగా ఉంది. రోగులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. సిబ్బంది కూర్చోవడానికే ఉన్న గదులు సరిపోవడం లేదు. దాతలు ఇచ్చిన స్థలంలో నూతన భవన నిర్మాణాన్ని చేపట్టాలి.

భవన నిర్మాణం చేపట్టాలి

●కందుకూరు నాగబాబు, దెందుకూరు



తమ గ్రామపెద్దలు, దాతలు కలిపి పీహెచ్‌సీ భవన నిర్మాణానికి స్థలం ఇచ్చినా భవనం నిర్మించకపోవడం బాధాకరమన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించాలి. నూతన భవన నిర్మాణానికి తక్షణమే నిధులు మంజూరు చేయించారు.

ఆర్టీసీ బస్టాండ్ ప్రవేశ ద్వారాల మూసివేతపై నిరసన



ఆర్టీసీ బస్టాండ్‌లో నిరసన తెలుపుతున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు

వైరా, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వైరా ఆర్టీసీ బస్టాండ్‌లోని రెండు ప్రధాన ప్రవేశ ద్వారాల మూసివేతను నిరసిస్తూ అఖిలపక్ష ఆధ్వర్యంలో శనివారం బస్టాండ్ ఆవరణంలో ఆందోళన చేశారు. ఈ ద్వారాల మూసివేతను ఎత్తివేసి యథావిధిగా బస్సుల రాకపోకలను పునరుద్ధరించాలని కోరుతూ స్టేషన్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. 1978నుంచి నేటివరకు బస్టాండ్‌లోని నాలుగు ప్రవేశ ద్వారాల నుంచి బస్సుల రాకపోకలు సాగుతున్నాయని తెలిపారు. రెండు ద్వారాలు మూసివేయడం వలన మధిర రోడ్డులో అలాగే క్రాస్ రోడ్డు వద్ద జాతీయ ప్రధాన రహదారిపై రద్దీ పెరిగి రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశముందని పేర్కొన్నారు. వెంటనే మూసివేసిన ద్వారాలను తిరిగి పునరుద్ధరించాలని వినతిపత్రంలో కోరారు. మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు, సీపీఎం నాయకులు చింతనిప్పు చలపతిరావు, సుంకర సుధాకర్, మేరుగు రమణ, పారుపల్లి కృష్ణారావు, తాళ్లపల్లి కృష్ణ, అమరనేని కృష్ణ, ఇమ్మడి సుధీర్, నాగూల్‌పాషా, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మద్దెల రవి, నాయకులు అప్పం సురేష్, మోటపోతుల సురేష్, టీజేఏసీ అధ్యక్షుడు షేక్.పాషా, సీపీఐ పట్టణ కార్యదర్శి మిట్టపల్లి రాఘవరావు, నాయకులు గారపాటి అశోక్, మోట కొండా పాల్గొన్నారు.

సాగర్‌జలాల కోసం రైతుల ఆందోళన

వైరా, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లాపురం గ్రామంలోని రైతులు సాగర్‌జలాల కోసం శుక్రవారం అర్థరాత్రి ఆందోళనకు దిగారు. వల్లాపురం మేజర్ పరిధిలో ఆగ్రామానికి చెందిన రైతుల భూములతోపాటు చింతకాని మండలం పొద్దుటూరు, బోనకల్ మండలంలోని లక్ష్మీపురం, గోవిందాపురం గ్రామాలకు చెందిన రైతుల భూములు కూడా ఉన్నాయి. ఈ మేజర్ చివరి ఆయకట్టుగా వల్లాపురం రైతులు దాదాపు 250ఎకరాల్లో మొక్కజొన్న సాగుచేశారు. వారబందీ విధానంలో ఈ కాల్వకు సాగర్‌జలాలు విడుదల చేస్తున్నారు. వారబందీ ప్రకారం నీరు విడుదల చేసిన సమయంలో కాల్వ పైభాగంలో ఉన్న రైతులు తమ పొలాలకు సాగునీరు పెడుతుండటంతో చివరి ఆయకట్టులోని మొక్కజొన్నకు నీరందడం లేదు. దాంతో మొక్కజొన్న పైరు ఎండిపోతుండటంతో శుక్రవారం అర్థరాత్రి కాల్వపై నీటి కోసం వెళ్లిన రైతులు నీటి జాడ లేకపోవడంతో అర్థరాత్రివేళ ఆందోళన చేపట్టారు. వెంటనే నీటిపారుదల శాఖ అధికారులు రైతుల వద్దకు చేరుకొని సాగునీరందించేలా తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

తల్లాడ తహసీల్దార్‌గా సురేష్‌కుమార్



తల్లాడ, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): తల్లాడ తహసీల్దార్‌గా వి.సురేష్‌కుమార్ శనివారం బాధ్యతలు స్వీకరించా రు. కూసుమంచి నుంచి బదిలీపై సురే ష్‌కుమార్ తల్లాడ తహసీల్దార్‌గా నియమితులయ్యారు. గతంలో పనిచేసిన తహసీల్దార్ వి.రవికుమార్ రఘునాథపాలెం మండలానికి బదిలీ కావడంతో అప్పటి నుంచి ఉపతహసీల్దార్ ఏ. వనజకు అదనపు బాధ్యతలు అప్పగించారు. జీవో 317 మేరకు వనజ నిజామాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో తల్లాడకు సురేష్‌కుమార్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు.

వెజిటబుల్స్ డే

మధిరటౌన్/మధిరరూరల్, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): మధిరలోని శ్రీనిధి కాన్సెప్ట్ స్కూల్ లో ప్రైమరీ విద్యార్థులకు శనివారం ఫ్రూట్స్ అండ్ వెజిటబుల్స్ డేని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ అంజన్‌బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయంలో ఏకాదశి పూజలు

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ పార్థసారథి గీతా జ్ఞానమందిరంలో శనివారం భీష్మ ఏకాదశి సందర్భంగా పూజా కార్యక్రమాలు నిర్వహించిన ట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన తదియరాధనలో భక్తులు పాల్గొని ఆహారపొట్లాలను పంపిణీ చేశారు.

వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న పండితులు

తల్లాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తల్లాడలో శనివారం వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. విగ్రహాన్ని శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠం ఆస్థాన పండితులు రామడుగు నర్సింహాచారి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో స్థల దాత రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, విశ్వబ్రాహ్మణసంఘం తల్లాడ మండల అధ్యక్ష, కార్యదర్శులు రుద్రాక్ష నర్సింహాచారి, తాటికొండ కృష్ణ, గంటల వెంకటాచారి, రవి, పరిపూర్ణాచారి, బాజోజు శేషభూషణం పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

కారేపల్లి, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్‌తో ఈనెల20న హైదరాబాద్‌లో నిర్వహించనున్న సభను విజయవంతం చేయాలని కోరుతూ శనివారం మండల పరిధిలోని పేరుపల్లి పంచాయతీలో సీపీఐ (ఎంఎల్)న్యూడెమోక్రసీ నాయకులు ప్రచారం నిర్వహించారు. పార్టీ నాయకులు వై.ప్రకాష్, కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. మిర్చి తోటలల్లో ప్రచారం నిర్వహించారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక

వైరా, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వైరాలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో 8వతరగతి విద్యార్థిని చీదిరాల వేదవర్షిత నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైంది. వేదవర్షితను ప్రధానోపాధ్యాయురాలు వెంకటమల్లేశ్వరి, ఉపాధ్యాయులు గాయత్రీ, సరళ, రమాదేవి, నాగమణి, సుశీల, రాణి, రామలక్ష్మి, ప్రైవేట్ ఉపాధ్యాయుడు బాదంశెట్టి వాసు అభినందించారు.



వైరాలో విద్యార్థి వర్షితను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సత్తుపల్లిరూరల్‌లో...

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ ప్రొవిజనల్ లిస్ట్‌లో సత్తుపల్లికి చెందిన 33మంది విద్యార్థులు ఎంపికైనట్లు ఎంఈవో నక్కా రాజేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలోని కాకర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపికైన 10మంది విద్యార్థులను శనివారం అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మేడా సత్యనారాయణ, జల్లిపల్లి మురళీమోహన్, నాతి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లిరూరల్: విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో నక్కా రాజేశ్వరరావు

ముదిగొండలో....

ముదిగొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడేపల్లి జడ్పీఉన్నత పాఠశాలలో 9మంది విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపర్చి ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు బండి నాగేశ్వరరావు తెలిపారు. శనివారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థులను మాజీ ఎంపీపీ సామినేని హరిప్రసాద్ అభినందించారు. జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం లో నిలిచిన జీవన మాధురికి ఆయన మెమోంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉన్నారు.



ముదిగొండలో విద్యార్థులను అభినందించిన దృశ్యం

తల్లాడ వాసికి డాక్టరేట్



గొల్లమందల రవి

తల్లాడ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): తల్లా డ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన గొల్లమందల రవికి డాక్టరేట్ దక్కింది. ఏపీలోని సత్యసాయి జిల్లా సైన్స్ అండ్ టెక్నాలజీ ఇన్నోవేషన్ యూనివర్సిటీ నుంచి రవి డాక్టరేట్ పొందాడు. డాక్టర్ కె.నాగజ్యోతి రవికి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. బోటనీ డెవలప్‌మెంట్ గోల్స్ గ్లోబల్ డైవోడేవర్సీటీ ఫ్రేమ్ వర్క్‌తో అనుసంధానం తెలంగాణ, భారత్ అనే పరిశోధనలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వృక్ష సంపద వాటి పరిరక్షణ, ఆదివాసీలకు ఉపయోగించే వివిధ రకాలైన ఔషధ మొక్కలపై పరిశోధనకుగానూ రవికి డాక్టరేట్ దక్కింది. డాక్టరేట్ సాధించడంలో సహకరించిన డాక్టర్ డి.వీరాంజనేయులకు రవి కృతజ్ఞతలు తెలిపాడు.

ఎంపీవోగా రాజారావు



బాధ్యతలు స్వీకరిస్తున్న రాజారావు

కల్లూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీవోగా పి. రాజారావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎంపీవోగా పని చేసిన సురేష్‌బాబు తల్లాడకు బదిలీ కాగా, ఆయన స్థానంలో రాజారావు ఖమ్మం నుంచి ఇక్కడకు వచ్చారు.

మసీదు కమిటీ ఎన్నిక



ఎన్నికైన మసీదు నూతన కమిటీ

వైరా, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వైరాలోని మసీదు కమిటీ కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేక్.రసూల్‌సాహెబ్, ఉపాధ్యక్షుడిగా షేక్.మీరా(కొండా), కార్యదర్శిగా షేక్.గౌస్, కోశాధికారిగా అబ్దుల్ రెహ్మాన్, గౌరవ సలహాదారులుగా షేక్.సోందుసాహెబ్, షేక్.వలీజాన్‌లను ఎన్నుకున్నారు. ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కమిటీ విజ్ఞప్తి చేసింది.

వేతనాల కోసం కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న ఆస్పత్రి కార్మికులు

కల్లూరు, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వేతనాలు చెల్లించాలని కల్లూరులోని ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న కార్మికులు మూడవ రోజైన శనివారం మొకాళ్లపై, చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆసుపత్రి గౌరవ అధ్యక్షుడు వేము రాం బాబు మాట్లాడుతూ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ గార్డులు, కార్మికుల జీతాలపై సంవత్సరానికి ఒక సారి జీతాలు చెల్లిస్తున్నారన్నారు. గత ఏడు నెలల క్రితం సమ్మె నోటీసు ఇస్తే వేతనాలు చెల్లించారని ఆయన చెప్పారు. జనవరి నెలలో సమ్మె నోటీసు ఇచ్చామని నాలుగు నెలలు గడిచిన కార్మికుల వేతనాలు చెల్లించడంలో కాంట్రాక్టర్, ప్రభుత్వ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారని ఆయన విమర్శించారు. వేతనాలు అందకపోవడంతో కార్మికుల కుటుంబాలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాగమణి, సరోజని, సురేంద్ర, ప్రమోద్, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ఆందోళన

చింతకాని, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట- దేవరపల్లి జాతీయరహదారిపై బస్వాపురం గ్రామం వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని రైతుల చేస్తున్న ఆందోళన రెండవ రోజు కొనసాగింది. శనివారం రైతులు చేస్తున్న ఆందోళనకు పలు పార్టీ రైతు సంఘం నాయకులు సంఘీబావం తెలిపారు. కార్యక్రమంలో రైతులు కన్నెబోయిన గోపి, బొడ్డు వెంకటరామారావు, నాగేశ్వరరావు, శ్రీనివాస్, చంద్రకాని నరసింహరావు, కోటేశ్వరరావు, పేరబోయిన రవి పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న రైతులు

డివైడర్లపై మొక్కలను సంరక్షించాలి

» మునిసిపల్ కమిషనర్ చింతా వేణు



మొక్కలను పరిశీలిస్తున్న కమిషనర్ వేణు

వైరా, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీలోని జాతీయ ప్రధాన రహదారిలో డివైడర్లపై చెత్తాచెదారంతో అధ్వానంగా ఉన్న మొక్కల సంరక్షణ పనులను శనివారం చేపట్టారు. మునిసిపల్ కమిషనర్ చింతా వేణు పర్యవేక్షణలో మునిసిపల్ సిబ్బంది, కార్మికులు ఈ పనులు నిర్వహించారు. డివైడర్లపైన మొక్కల సంరక్షణ, పెంపకం నిర్వహణకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

రిలేటెడ్-పే ఇవ్వాలని వినతి



జీఎంకు వినతిపత్రం అందిస్తున్న సంఘబాధ్యులు

సత్తుపల్లి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పెర్మార్మెన్స్ రిలేటెడ్-పే (పీఆర్‌సీ) ఇవ్వాలని కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.షాలెంరాజుకు సింగరేణి ఉద్యోగులు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆసంఘ ప్రెసిడెంట్ ఎంవీ.నరసింహారావు మాట్లాడుతూ 2022-23, 2023-24లో ఆర్థిక సంవత్సరాలలో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించడంలో అధికారుల పాత్ర ఎంతగానో ఉందని, అయితే కోలిండియా గతేడాది జూన్‌లో చెల్లించారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా జీఎం స్పందిస్తూ సమస్య పరిష్కారంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రమేష్, శ్రీనివాస్, ఉపేందర్, ప్రదీప్, వైవీ.రావు, యాదగిరి, శేషశ్రీ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

» మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం



వెంకయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాగభూషణం

బోనకల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఐఎఫ్ఎస్ అధికారి కూరాకుల వెం కయ్య స్ఫూర్తితో విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని మాజీ డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం సూచించారు. మండలంలోని ఆళ్లపాడు ఉన్నత పాఠశాలలో శనివారం వెంకయ్య వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పదవ తరగతిలో ప్రతిభ చాటిన రాహుల్ సాయి, స్పందనలకు రూ. 5వేల నగదు చొప్పున ప్రోత్సాహకాలను అందజేశారు. అదే విధంగా వాలంటీర్‌కు రిటైర్డ్ ఏసీపీ రవీందర్ రూ. 10వేల నగదు, ప్రొఫెసర్ రూ. 5వేల నగదును విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త మరీదు బరకయ్య, హెచ్ఎం శ్రీలత, మాజీ సర్పంచ్ మర్రి తిరుపతిరావు పాల్గొన్నారు.



సత్తుపల్లిలో సంబురాలు చేసుకుంటున్న బీజేపీ కార్యకర్తలు



వైరాలో...



మధిరటౌన్‌లో....

బీజేపీ సంబురాలు

సత్తుపల్లి/ఎర్రుపాలెం/తల్లాడ/వైరా/మధిరటౌన్/కల్లూరు/చింతకాని/పెనుబల్లి/ ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ విజయదుందుబీ మోగించడం పట్ల ఆయా పట్టణాలలో, గ్రామాలలో శనివారం ఆపార్టీ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. బాణాసంచా పేల్చి మిఠాయిలు పంచారు. అనంతరం కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రధాని మోదీ ఆధ్వర్యంలో ఢిల్లీలో డబుల్ ఇంజన్ సర్కార్ వికసిత్ భారత్‌దిశగా పరుగులు పెడుతుందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన తెలంగాణలో కూడా డబుల్ ఇంజన్ సర్కార్ రావడం ఖాయమని అన్నారు. మోడీ నాయకత్వమే ఈ దేశానికి శ్రీరామ రక్ష అని, ప్రజలు బీజేపీ పక్షాన నిలబడ్డారని అన్నారు. ఆయా కార్యక్రమాలలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పెనుబల్లిలో...



కల్లూరులో....



చింతకానిలో....



ఎర్రుపాలెంలో...

'గార్లొడ్డు గుట్టలపై ప్రత్యేక నిఘా'

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



తవ్వకాల ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు

ఏన్కూరు, ఫిబ్రవరి8(ఆంధ్రజ్యోతి): గార్లొడ్డు గుట్టలపై రెవెన్యూ, మైనింగ్ శాఖ అధికారులు ప్రత్యేకనిఘా పెట్టారు. ఈనెల 5న ఆంధ్రజ్యోతిలో తరిగిపోతున్న గుట్టలు ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శనివారం గుట్టల తవ్వకపు ప్రాంతాలను మైనింగ్‌శాఖ రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, రెవెన్యూశాఖ ఆర్ఐ నవీన్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ఏ ప్రాంతంలో అనుమతి ఎంత తీసుకున్నారు, ఎంత తవ్వారనేది సోమవారం పూర్తిస్థాయిలో విచారించనున్నట్లు తెలిపారు. ఇక నుంచి ప్రతినిత్యం గుట్టలపై ప్రత్యేక నిఘా పెట్టినట్టు తెలిపారు.

కిష్టారంలో వైద్యశిబిరం

సత్తుపల్లిరూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆధ్వర్యంలో శనివారం మండలంలోని కిష్టారంలో మూడు ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాలను కిష్టారం ఓసీ పీవో ఎంవీ.నరసింహారావు ప్రారంభించారు. రోగులను డాక్టర్ శిరీష పరీక్షించి మందులను అందజేశారు. కార్యక్రమంలో సెక్రటరీ రమణ, వెల్ఫేర్ ఆఫీసర్ విజయసందీప్ పాల్గొన్నారు.